

APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక



సంపుటి : 01 | సంచిక : 67 | 28 - 10 - 2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : 09 /-

Published In Srikakulam , Vijayanagaram , Vishakapatnam, Araku , Anakapalli , Kakinada , Narasapuram, Amalapuram, Rajamundry, Eluru , Machilipatnam , Vijayawada

— లిటిగేషన్లే ఆ పార్టీ రాజకీయం —

మా రెండున్నరేళ్ల కష్టాన్ని గుర్తించండి : సీఎం

- ఎన్నికలు ఆపేందుకు ఏకంగా 62 పిటిషన్లు దాఖలు చేశారని ఆరోపణ
- హింసను వీడి వైసీపీ నేతలు జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపు
- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ధీమా
- రెండున్నరేళ్ల పాలనను చూసి స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి



మిగతా 8లో...


అమరావతి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసి ప్రభుత్వ కార్యకలాపాలను అడ్డుకోవడమే ప్రధాన రాజకీయంగా పెట్టుకుని, లిటిగేషన్లతో రాష్ట్రాభివృద్ధిని నిరోధించడమే లక్ష్యంగా 'గొడ్డలి పార్టీ' పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడానికి ఆ పార్టీ చేయని ప్రయత్నం లేదని, అభివృద్ధిని సహించలేని తత్వంతో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. వారి సిద్ధాంతం క్రిమినలైజేషన్, లిటిగేషన్, ఫేక్ ప్రాపగాండా అయితే.. తమ కూటమి సిద్ధాంతం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అని ఆయన స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల తమ కష్టాన్ని గుర్తించి, 2024 ఎన్నికల్లో ఇచ్చినట్లే, ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కూడా చారిత్రాత్మక మద్దతుతో కూటమిని ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు గుప్పించారు. "రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు ఆ పార్టీకి లేవు. రాష్ట్రానికి మంచి జరగడం, అభివృద్ధి జరగడం వారికి ఇష్టం లేదు. అందుకే, ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనీయకుండా చూడాలన్నదే వారి ఆలోచన. ఈ ఎన్నికలను ఆపడానికి ఏకంగా 62 పిటిషన్లు వేశారు. సర్వేపైనా, డీలిమిటేషన్ పైనా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకెక్కారు. ఇప్పుడు ఎన్నికలు జరగకపోతే కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు ఆగిపోతాయి. స్థానిక సంస్థలు

మిగతా 8లో...



సీఈసీ నిర్ణయాలపై సుప్రీం
కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తీసుకుంటున్న నిర్ణయాలపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సహా కీలక నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే తీసుకున్నారా? లేక మిగతా కమిషనర్ల అభ్యంతరాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశాలను పరిశీలిస్తామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్



తీరానికి దగ్గర్లో అర్ణబ్

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అలర్ట్

అమరావతి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): అర్ణబ్ తుఫాను తీరానికి దగ్గర్లో ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తాజాగా వెల్లడించింది. ఈ 12 గంటలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అలర్ట్ చేసింది. తుఫాను ప్రభావంతో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో రేపు ఉదయం వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని చెప్పింది . కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో రేపు ఉదయం వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. గంటకు 100-140 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. పూరిళ్లు, రేకుల షెడ్లలో నివసించే వారు తమకు దగ్గర్లోని పునరావాస

పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా


మిగతా 8లో...

భయపడొద్దు : జగన్

అమరావతి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): "ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు. "మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని



మీరు 2.0 అంటే
మేం 10X చూపిస్తాం

జగన్‌కు పవన్ కల్యాణ్ వార్నింగ్

అమరావతి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో బదులిచ్చారు. వైసీపీ '2.0' అంటూ బెదిరింపులకు దిగితే, ఎన్డీఏ కూటమి '10ఎ' అంటే ఏంటో చూపిస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్

'ప్రాణనష్టం జరగకుండా చూడాలి' : మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): ఆర్ణబ్ తుఫాన్ నేపథ్యంలో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు (మంగళవారం) శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీరప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, వరద ముంపు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత


మిగతా 8లో...

ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మూడు జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి అన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి, అపరాల పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని.. కల్లాల్లోని ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరచాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అరటి, బొప్పాయి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని.. పశువులను సురక్షిత ప్రాంతాలకు



స్థానిక ఎన్నికల్లోనూ
విజయం సాధిస్తాం

అమరావతి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో సానుకూల వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై సుదీర్ఘ కసరత్తు అనంతరం ఏకాభిప్రాయానికి వచ్చామని చెప్పారు. కింది స్థాయిలోనూ సమన్వయంతో ఎన్నికల బరిలో నిలిచామని వెల్లడించారు. కూటమిలో విభేదాలు వస్తాయన్న ప్రత్యర్థుల



పునరావాస కేంద్రాలను
సిద్ధం చేయాలి

హోం మంత్రి అనిత ఆదేశం

అమరావతి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): రాష్ట్రంలో ఏ క్షణమైనా తీరప్రాంత ప్రజల తరలింపునకు పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉండాలని అధికారులను హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఈ కేంద్రాల్లో స్వచ్ఛమైన తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందించాలని స్పష్టం చేశారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112 లను

అర్ణబ్ తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి : రామ్మోహన్ నాయుడు

- ప్రజల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- మత్స్యకారులు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

అమరావతి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): బంగాళాఖాతంలో ఏర్పడిన అర్ణబ్ తుఫాను నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా ప్రజల భద్రత, ముందస్తు నివారణ చర్యలపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆరా తీశారు. ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్ స్పష్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర జిల్లా స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను తాజా పరిస్థితులు, భారీ వర్షాలు కురిసే అవకాశాలు, జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యల గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. తుఫాను కారణంగా ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.తుఫానుకు సంబంధించి భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్‌లో వెల్లడించిన అంచనాలను ప్రజలు గమనించాలని మంత్రి సూచించారు. తుఫాను తీరాన్ని దాటే సమయం, గాలుల వేగం, వర్షాల తీవ్రతపై అధికారిక హెచ్చరికల



ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు. తుఫాను ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తీరప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, అవసరమైన చోట సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. కంట్రోల్ రూములు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని, పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, ఇతర అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు అత్యవసర సహాయక పరికరాలను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్, వైద్య, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు అధికారిక సమాచారం అందించాలని కోరారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వంశధార, నాగావళి, బహుదా, మహేంద్ర తనయ నదుల పరివాహక ప్రాంతాల ప్రజలు వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సూచించారు. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాల కారణంగా నదుల్లో నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉన్నందున నదీ తీరాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. నదుల్లో నీటి ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించాలని తెలిపారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

APTEL/26/A2902


గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

సంపాదకీయం

నిరసనలన్నీ ముస్లింల ఖాతాలోనే..!

ప్రపంచ దేశాల్లో ఇప్పుడొక ఒక విచిత్రమైన సంప్రదాయం కొనసాగుతోంది. తినడానికి తిండి దొరక్కపోయినా, ఉద్యోగాలు లేకపోయినా, మంచిచదువు అందకపోయినా, వైద్యం దొరక్కపోయినా ప్రజలు ప్రభుత్వాలను ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక పాలకులు ఆ నిందను ముస్లింల మెడకు చుడుతున్నారు. ఫ్రాన్స్, గ్రీస్, ఇటలీ తదితర యూరోపియన్ దేశాలలో యువతరం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేస్తున్నది. ఈ అసంతృప్తికి పరిష్కారం చూడమని సలహా ఇవ్వాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'పారిస్ అతి త్వరలో ముస్లింల నగరంగా మారబోతోంది!' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యూయేల్ మేక్రాన్‌ను హెచ్చరించాడు. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను కోరుతూ ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరసన ప్రదర్శనకు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు ఇచ్చినపుడు దాన్ని ఆపడానికి మోదీ సర్కార్ జెన్‌జీపై ఉక్కుపాదం మోపింది. ఏకంగా 30 వేల మందికి పైగా సాయుధ బలగాల్ని మోహరించింది, నిషేధాజ్ఞలు పెట్టింది, మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసింది. 45 మెట్రో స్టేషన్లను మూసివేసి, ఢిల్లీకి వచ్చే దాదాపు 250 రైళ్లను రద్దు చేసింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా అన్న ప్రశ్నకు ప్రభుత్వం దగ్గర ఒక గొప్ప సమాధానం ఉంది. అది అప్పుడప్పుడు నోటితో చెపుతుంది, కుదరనప్పుడు సోషల్ మీడియా వాడుతుంది. 'సాధారణంగా ఈ రైళ్లలో ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన ప్రయాణికుల రిజర్వేషన్లు 10 నుంచి 15శాతం మాత్రమే ఉంటాయట. కానీ అక్టోబర్ 9, 10 తేదీల్లో ఆ సంఖ్య 40 నుంచి 60 శాతానికి పెరిగిపోయిందట! ఎవరీ నిర్దిష్టవర్గం? ముస్లింలు అని చెప్పకనే చెప్పారు. ప్రభుత్వం నిందలు వేస్తుంది. ఆధారాలు చూపదు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనేవి మన రాజ్యాంగ ఆదర్శాలు. ఈ మహోన్నత భావాల పుట్టినిల్లు 1789 నాటి ఫ్రెంచ్ విప్లవం. ఇప్పుడు ఆ పుట్టినింటిలోనే ఈ ఆదర్శాలకు ముప్పు వచ్చింది. ప్రస్తుత ఫ్రాన్స్ పరిస్థితి విక్టర్ హ్యూగో 1862లో రాసిన 'లే మిజరబుల్స్' ఫ్రెంచ్ నవలకు పోలి ఉంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ నవల అనేకభాషల్లో అనువాదమయింది. తెలుగులో రెండుసార్లు బీదలపాట్లు పేరుతో సిని మాగా వచ్చింది. పిల్లల ఆకలిని చూడలేక రొట్టెను దొంగిలించి జైలు పాలవుతాడు ప్రధానపాత్ర జీన్ వాల్జీన్. పిల్లల్ని చూడాలని జైలునుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో శిక్షను 19 ఏళ్లకు పెంచుతారు. ఇటీవల ప్రపంచ దేశాలన్నింటిలోనూ సంపద పంపకాల్లో ఒక సాధారణ నియమం కనిపిస్తున్నది. దేశ సంపదలో అత్యధికం కొద్ది కుటుంబాల చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. అతి తక్కువ సంపదను అత్యధిక కుటుంబాలు పంచుకోవాల్సి వస్తున్నది. ఫ్రాన్స్‌లో ప్రభుత్వ విద్యాసంస్థల్ని మూసేస్తున్నారు, క్లాస్ రూములు కిక్కిరిసిపోతున్నాయి. టీచర్లు లేరు. జీతాలు ఇంటి అద్దె చెల్లించడానికి కూడ సరిపోవడం లేదు. ఇంట్లో ఒక్కరికి ఆరోగ్య సమస్య వచ్చినా కుటుంబం రోడ్డున పడాల్సి వస్తోంది. ఈ దయనీయ పరిస్థితుల మీద పత్రికలు పుంఖాను పుంఖలుగా కథనాలు ప్రచురించాయి. సెప్టెంబర్‌లో అసహనం బద్దలయింది, అక్టోబర్‌లో తార స్థాయికి చేరుకుంది. సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాల జ్యుడిషియల్ కస్టడీ కేసు విచారణకు వచ్చినపుడు ఢిల్లీ హైకోర్టు బెంచి మీరిద్దరూ జెన్--జీ కాదుకదా? అని ఒక ఆసక్తికర వ్యాఖ్య చేసింది. 1997--2012 మధ్య కాలంలో పుట్టిన వారిని జెన్--జీ అంటారు. వాళ్ళిద్దరూ అంతకన్నా ముందు పుట్టారని హైకోర్టు బెంచి గుర్తు చేసింది. ఫ్రాన్స్‌లో నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహిస్తున్న ర్యాధ్ రానీ 2007లో పుట్టాడు. అచ్చమైన జెన్--జీ. ముక్కుపచ్చలారని ఈ 19 యేళ్ళ కుర్రాడు హైస్కూలు విద్యార్థి యూనియన్ యాక్టివిస్టు. ఇప్పుడు ఇదొక ట్రెండ్. పటిష్ఠమైన నిర్మాణాలున్న వ్యక్తులు, సంస్థలు చేయలేని అద్భుతాలను 'కుర్రకుంకలు' చేసేస్తున్నారు. వీళ్లు ఎంతకాలం నిలబడతారూ వంటి ప్రశ్నలు సహజంగానే ముందుకు వస్తాయి. సీజేపీ నాయకుడు అభిజిత్ దీప్కేమీద మన దగ్గర కూడ అప్పుడే గుసగుసలు మొదలయ్యాయి. నిజానికి అతను చేయాల్సిన పనిని ఈ పాటికే చేశాడు. సింహాసనాన్ని వణికించాడు, ఆ సింహాసనం మీద ప్రజల్లో భయాన్ని పోగొట్టేశాడు. సీజేపీ నిలదొక్కుకుంటుందా? ఎవరితో జత కడుతుంది? వగైరాలన్నీ జరగవచ్చు, జరక్కపోనూవచ్చు. అయినప్పటికీ అభిజిత్ ఈ పాటికే చేసిన పని చరిత్రలో నిలిచిపోతుంది. ఫ్రాన్స్ నిరసన ప్రదర్శనల్లో మనకు టోపీవాలాలు, బుర్ఖా మహిళలు కనిపించరు. కానీ, ట్రంప్ వంటివాళ్ళు వాళ్లందర్నీ ముస్లింల ఖాతాలో వేస్తున్నారు. కొత్త పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా సాగిన షాహీన్ బాగ్ ఉద్యమం అచ్చంగా ముస్లిం మహిళలు నడిపిన కార్యక్రమం. ఈ జంతర్ మంతర్ ఉద్యమం అలా కాదు. నిరసనల్లో చాలా అరుదుగా మాత్రమే ముస్లింలు కనిపిస్తారు. అయినప్పటికీ ముస్లింలే దాన్ని నిర్వహిస్తున్నారని ప్రభుత్వవర్గాలు ప్రచారం చేస్తున్నాయి. పోలీసులకు ఒక అపద్ధర్మ నియమం ఉంటుంది. 'ఎప్పుడూ అనుమానించేవాళ్లనే మళ్లీ పట్టుకోండి!' ఏదైనా ఒక పెద్ద సంఘటన జరగ్గానే వాళ్ళు హడావిడిగా కొందరిని అరెస్టు చేసి, అప్రమత్తంగా ఉన్నామనే సంకేతాన్ని ఇస్తుంటారు. 2007 మే నెలలో హైదరాబాద్ మక్కా మసీదులో పేలుడు జరిగినపుడు పాతబస్తీలో అనేకమంది ముస్లింలను జైళ్లకు పంపించారు. మీడియా చెలరేగిపోయింది. కొంతకాలం తరువాత ఆ సంఘటన వెనుక అభినవ భారత్ అనే సంస్థ పేరు బయటికి వచ్చింది. స్వామీ అసీమానంద తదితరుల్ని అరెస్టు చేసి ముస్లింలను విడుదల చేశారు. 2020 మార్చి నాటి సంచలన నిజాముద్దీన్ మర్కజ్--కరోనా సూపర్ స్ప్రెడర్ కేసు కూడ ఇలాంటిదే. మర్కజ్‌లో ముస్లింలు కరోనాను 'సోకించుకుని' దాన్ని దేశమంతా వ్యాపింపచేయాలని కుట్ర చేశారనేది ఆరోపణ. ఈ మాత్రం ఉప్పు అందగానే 'ఒళ్ళో మీడియా' (గోదీ మీడియాకు తెలుగు) చెలరేగిపోయింది. ఆ సందర్భంగా మర్కజ్‌లో వున్న 70 మందిని అరెస్టు చేశారు. విచిత్రం ఏమంటే వైద్య పరీక్షల్లో వారిలో ఒక్కరికీ కరోనా పాజిటివ్ రాలేదు. ఢిల్లీ హైకోర్టు,

అలహాబాద్ హైకోర్టు ఈ కేసుల్ని నిరాధారంగా తేల్చి కొట్టిపడేశాయి. ఈ లోపు ముస్లిం ఫోబియా తెగ ప్రచారం అయిపోయింది. దేశ సంపద పెరిగినంత మాత్రాన ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని అనుకోవడానికి వీల్లేదు. కార్పొరేట్ లాభాలు పెరగవచ్చు, స్టాక్ మార్కెట్లు ఎగబాకవచ్చు. కానీ ఆ సంపదలో సామాన్యులకు ఎంత వాటా దక్కుతోంది? అనేది ప్రశ్న. ద్రవ్యోల్బణం అంటే కేవలం మార్కెట్లో ధరలు పెరగడం కాదు. ఆదాయాలు, ఖర్చుల మధ్య సంబంధం కూడా ముఖ్యం. ధరలు పెరుగుతున్నప్పుడు ఆదాయం పెరగకపోతే, ప్రజల వాస్తవ కొనుగోలు శక్తి పడిపోతుంది. ఫ్రాన్స్ ఆందోళనకారులు మూడే ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక టీచర్ జీతంతో కుటుంబ ఖర్చులు తీరుతున్నాయా? ఒక విద్యార్థి భవిష్యత్తుకు సమాన అవకాశాలు ఉన్నాయా? ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికేవరకు ర్యాధ్ రానీ కాకపోతే మరొకరు జనాన్ని రోడ్ల మీదికి తీసుకుని వస్తారు. ఇది చర్యకు ప్రతిచర్య. చర్యను ఖండించని వారు ప్రతిచర్యను ఖండించడం సబబు కాదు. ట్రంప్ మేక్రాన్‌ను హెచ్చరించాడు గానీ అతని భయాలు అతనికి ఉన్నాయి.



ఎడిటర్ : దొండ్లవాగు భవ్య

కోనసీమలో హైఅలర్ట్

- అర్నబ్ తుఫాన్ హెచ్చరికలు.. అప్రమత్తమైన కోనసీమ యంత్రాంగం!
- తీర ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల గస్తీ
- లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు.. మూడు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు



అమలాపురం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశిస్తున్నారు. అమలాపురం--అంతర్వేది మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్న హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని, బలమైన గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర సేవలను కొనసాగించేందుకు పక్క జిల్లాల నుంచి కూడా విద్యుత్ శాఖ సిబ్బందిని రప్పించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మూడు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. కలెక్టర్ మహేష్ కుమార్ భైరవపాలెం, బలుసుతిప్ప, గచ్చకాయలపోర తదితర తీర ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిస్థితిని పరిశీలిస్తున్నారు. స్థానిక అధికారులతో సమీక్షలు నిర్వహించి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు రామచంద్రపురం, ముమ్మిడివరం, అమలాపురం ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. తుఫాన్ ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌లను సంప్రదించి సహాయం పొందాలని సూచిస్తోంది. తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు.

మాట తప్పితే అర ఎకరం వదులుకుంటా

- సర్పంచ్ అభ్యర్థి పాటి నాగ సత్యనారాయణ వినూత్న నిర్ణయం
- హామీ నెరవేర్చకపోతే అర ఎకరం భూమి పంచాయతీకి!
- 18 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాన్ని మార్చాలన్న లక్ష్యం



శ్రీరాంపురం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): ఎన్నికల్లో హామీలు ఇవ్వడమే కాదు.. వాటిని నెరవేర్చకపోతే తన సొంత భూమిని పంచాయతీకి అప్పగిస్తానంటూ ఓ సర్పంచ్ అభ్యర్థి ముందుకొచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని యు.కొత్తపల్లి మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన యువ నాయకుడు పాటి నాగ సత్యనారాయణ తన ధర్మపత్ని సత్యవేణిని సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలుపుతూ ఈ వినూత్న హామీ ప్రకటించారు. గ్రామంలో గత 18 ఏళ్లుగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని, ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్) పరిణామాల నేపథ్యంలో గ్రామం అభివృద్ధికి దూరమైందని ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సోలార్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి, రెండు ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, రహదారుల అభివృద్ధి, సోలార్ వీధి దీపాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో తనకు చెందిన అర ఎకరం భూమిని పంచాయతీ స్వాధీనం చేసుకునేలా వీలునామా రాస్తానని ప్రకటించారు. ఎన్నికల్లో ఇచ్చే హామీలకు బాధ్యత వహించాలనే ఉద్దేశంతోనే తన సొంత ఆస్తిని పణంగా పెట్టేందుకు సిద్ధమయ్యానని నాగ సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకొస్తున్న యువ నాయకత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వర్షం లో కూడా వైసీపీ అభ్యర్థి సరోజినీ ప్రచారం



అనకాపల్లి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారంలో 108 వ వార్డ్ ఇంచార్జ్ బొడ్డెడ సరోజినీ పాల్గొన్నారు తన భర్త శివ ఆధ్వర్యంలో నీలకంఠ రావు వీధిలో జోరు వానలో ప్రచారం చేశారు వాటర్ లోనే గెలిపించాలని అభ్యర్థించారు కరపత్రాలు అందజేశారు గెలిపి లక్ష్యంగా ముందుకు సాగారు పెద్ద ఎత్తున అనుచరులు వెంటరాగా ప్రచారం జోరుగా సాగింది తమ గెలుపు ఖాయమని ప్రజల భరోసా కచ్చితంగా శివ తెలిపారు ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

తుఫాన్‌పై అప్రమత్తం..ప్రజల భద్రతకు పెద్దపీట!

- పోలవరం పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన హోంమంత్రి అనిత
- అత్యవసర సాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు




పోలవరం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర హోంమంత్రి అనిత సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో మంగళవారం పోలవరం గ్రామంలోని పునరావాస కేంద్రాన్ని ఆమె సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ప్రజలకు కల్పించిన వసతులు, ఇతర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందే ప్రజలకు అవసరమైన సహాయం అందించడంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తుఫాన్ సమయంలో ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత కోరారు. వాతావరణ పరిస్థితులపై అధికారులు జారీ చేసే హెచ్చరికలను గమనిస్తూ, వారి సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సత్వర సహాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అత్యవసర సహాయం కోసం 112, విపత్తుల సమయంలో సహాయక చర్యలకు సంబంధించిన సమాచారం కోసం 1070 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని హోంమంత్రి స్పష్టం చేశారు.



జడ్పీటీసీ పోరుకు టీడీపీ సై

- కాకినాడ రూరల్ జడ్పీటీసీ బరిలో పిల్లి అనంతలక్ష్మి
- టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యేకు అవకాశం.. పార్టీ అధిష్ఠానం నిర్ణయం



కాకినాడ , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): కాకినాడ రూరల్ జడ్పీటీసీ ఎన్నికల బరిలో తెలుగుదేశం పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి అనంతలక్ష్మి పోటీ చేయనున్నారు. జడ్పీటీసీ అభ్యర్థిగా ఆమె పేరును పార్టీ ఖరారు చేసింది. పార్టీ అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయం కాకినాడ రూరల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సూచనలతో పిల్లి అనంతలక్ష్మి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన బాధ్యతతో ఆమె ఎన్నికల బరిలో నిలవనున్నారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో పాటు, ప్రస్తుతం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న పిల్లి అనంతలక్ష్మికి కాకినాడ రూరల్ ప్రాంతంలో రాజకీయ పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ ఎన్నికల్లో ఆమె అభ్యర్థిత్వం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ అధిష్ఠానం నిర్ణయంతో కాకినాడ రూరల్‌లో ఎన్నికల రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి. ఎన్నికల ప్రచారం, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయ పరిణామాలు రానున్న రోజుల్లో కాకినాడ రూరల్ ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేయనున్నాయి.

పొన్నగంటి నాగమణిని గెలిపించండి



కసింకోట , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): మండలం జడ్పిటిసి ఎంపీటీసీలను గెలిపించాలని ప్రచారం జరిగింది. నర్సింగబిల్లి యన్ జి పాలెం గొబ్బూరు గ్రామంలో జడ్పిటిసి అభ్యర్థి పొన్నగంటి నాగమణి అప్పారావు పాల్గొన్నారు. అప్పారావు మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజలు, మహిళల సంక్షేమానికి అనేక పథకాల ద్వారా అండగా నిలుస్తోందన్నారు. కూటమిపాలన అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా సాగుతుందన్నారు. సూపర్ సిక్స్ ని సూపర్ హిట్ చేశామని దేశంలోనే ఏ రాష్ట్రంలోని లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్లు ఇస్తున్నామని . గతంలో ఎన్నడు లేని విధంగా కూటమి పాలనలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ . మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ సహకారంతో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

ఇవన్నీ మన కూటమి నాయకులు అందరూ ప్రజలకు తెలియచెప్పాలన్నారు. తదనంతరం కూటమి నాయకులు దుస్సాలువ కప్పి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి. జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కాయల మురళీధర్. జనసేన నాయకులు కర్రి సత్యనారాయణ కలిగట్ల సింహాద్రి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గొంతిని చిరంజీవి కోపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ మజ్జి నిరంజన్ కుమార్ మాజీ సర్పంచ్లు మజ్జి సూర్య ప్రకాష్ ఎలమంచిలి వెంకట్రావు నీటి సంఘం చైర్మన్ ఉప్పలూరు అప్పలనాయుడు మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మజ్జి శ్రీకర్ మండల ఐ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జెర్రిపోతుల నూకునాయుడు క్లస్టర్ ఇంచార్జ్ అనాల తాతీలు నాయుడు జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు మజ్జి బాబ్జి కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ మరపు

తుఫాన్ దెబ్బకు రైళ్లకు బ్రేక్



- అర్నబ్ తుఫాన్ అలర్ట్.. రైల్వే శాఖ అప్రమత్తం
- రెండు రోజుల్లో 111 సర్వీసులు రద్దు
- ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం..
24 గంటల పాటు ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు

విజయవాడ , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని దక్షిణ కోస్తా రైల్వే జోన్ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. తుఫాన్ కారణంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, భద్రతకు ప్రాధాన్యమిస్తూ పలు రైలు సర్వీసులను రద్దు చేసింది. అక్టోబర్ 27న సుమారు 58 రైళ్లను, అక్టోబర్ 28న మరో 53 రైళ్లను రద్దు చేసినట్లు సమాచారం. దీంతో రెండు రోజుల్లో మొత్తం 111 రైలు సర్వీసులపై ప్రభావం పడింది.తుఫాన్ పరిస్థితులపై దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ డివిజనల్ రైల్వే మేనేజర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, రైళ్ల రాకపోకల పర్యవేక్షణ, ప్రయాణికుల భద్రతకు సంబంధించి అధికారులకు కీలక సూచనలు చేశారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో రాజమండ్రి-విజయవాడ, విజయవాడ-మచిలీపట్నం, గుడివాడ-మచిలీపట్నం, కాకినాడ పోర్ట్-విశాఖపట్నం, విజయవాడ-నరసాపురం, భీమవరం, నిడదవోలు, గుంటూరు-రేపల్లె, గుంటూరు-తెనాలి తదితర మార్గాల్లో పలు రైలు సర్వీసులు రద్దయ్యాయి. తుఫాన్ తీవ్రత మరింత పెరిగితే పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని రైళ్లను రద్దు చేసే అవకాశం ఉందని రైల్వే వర్గాలు వెల్లడించాయి. అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో 24 గంటల పాటు నిరంతరాయంగా పనిచేసే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తుఫాన్ పరిస్థితులను పర్యవేక్షిస్తూ, సంబంధిత విభాగాల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. రైలు ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు సంబంధిత రైలు సర్వీసుల స్థితిగతులను అధికారిక రైల్వే సమాచార మార్గాల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు మూసివేత

భక్తుల రాకపోకలకు మహామండపం మార్గం మాత్రమే అనుమతి



విజయవాడ , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో విజయవాడ నగర పరిసర ప్రాంతాల్లో అక్టోబర్ 27 మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డును పూర్తిగా మూసివేయనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) వి.కె. శీనానాయక్ వెల్లడించారు. వర్షాల సమయంలో భక్తులకు ఎలాంటి ప్రమాదాలు ఎదురుకాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో తెలిపారు. అక్టోబర్ 27న అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. భక్తుల రాకపోకలకు మహామండపం మార్గాన్ని మాత్రమే వినియోగించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన సిబ్బంది అప్రమత్తంగా ఉండి అవసరమైన సేవలు అందిస్తారని ఈవో పేర్కొన్నారు. భక్తులందరూ ఈ మార్పును గమనించి, దేవస్థానం భద్రతా సిబ్బంది, అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యం!

- గాడిమొగ పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- బాధితులకు భోజనం, తాగునీరు సహా అన్ని సౌకర్యాలు కల్పించాలి



కాకినాడ , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుఫాన్ ప్రభావం నేపథ్యంలో కాకినాడ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్ కారణంగా ఈదురుగాలులు, వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సంయుక్తంగా పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించిన కలెక్టర్, ఎస్పీ పునరావాస కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. బాధితులకు భోజనం, తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. గాడిమొగ, పోలేకుర్రు గ్రాంట్ గ్రామాల్లోని ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించే జాగ్రత్తలను పాటించాలని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంపై అధికారులు దృష్టి సారించారు.

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారు
జగ్గంపేటలో వైఎస్ఆర్సీపీ భారీ ర్యాలీ



జగ్గంపేట , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జగ్గంపేట గోకవరం రోడ్డులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి రావుల గణేష్ రాజా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సీపీ యువజన నాయకులు, మాజీ మంత్రి, వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ తోట నరసింహం తనయుడు తోట రాంజి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఈ సందర్భంగా తోట రాంజి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు ఆ ప్రభుత్వ మోసాలను గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెప్పే రోజులు వచ్చాయని స్పష్టం చేశారు. ప్రజలు తమ అమూల్యమైన ఓటును ఏ పార్టీ అయితే తమ కోసం పనిచేస్తుందని నమ్ముతున్నారో ఆ పార్టీకే వేయాలని కోరారు. జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రావుల గణేష్ రాజాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓమ్ని రఘురాంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓమ్ని రఘురాం మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలు చూస్తూనే ఉన్నారని తెలిపారు. జడ్పిటిసి, ఎంపీటీసి స్థానాలకు క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్న అభ్యర్థులందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను "జగ్గంపేట సైనికులు"గా అభివర్ణించారు.కష్టకాలంలోనూ పార్టీ కోసం నిలబడి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలపరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ఏ అభ్యర్థి కూడా భయపడాల్సిన పనిలేదని, అందరం కలిసి సమర్థవంతమైన నాయకత్వాన్ని సాధించుకుందామని పిలుపునిచ్చారు. ప్రజాక్షేత్రంలో అభ్యర్థి రావుల గణేష్ రాజా ఈ సందర్భంగా జడ్పిటిసి అభ్యర్థి రావుల గణేష్ రాజా ఓటర్లను కలిసి మద్దతు కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అన్యాయాలపై ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించినట్లు ఆయన తెలిపారు.

రాజానగరంలో ఊపందుకున్న చేరికల పర్వం

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమక్షంలో
జనసేన పార్టీలో చేరిన 40 వైసీపీ కుటుంబాలు

రాజానగరం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): రాజానగరం నియోజకవర్గం, రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ)కి భారీ షాక్ తగిలింది. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సుపరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై గ్రామానికి చెందిన వైసీపీ పార్టీ మాజీ ప్రెసిడెంట్ పేపకాయల వీర గోవిందు, మాజీ వైస్ ప్రెసిడెంట్ తోరాటి తాతాజీ, సుమారు 40 కుటుంబాలు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరాయి.ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పార్టీ కండువాలు కప్పి వారిని సాధరంగా జనసేన కుటుంబంలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ."కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, కూటమి సిద్ధాంతాలపై నమ్మకంతోనే ప్రజలు స్వచ్ఛందంగా జనసేన పార్టీ వైపు వస్తున్నారు. చక్రద్వారబంధం గ్రామంలో పేపకాయల వీర గోవిందు, తోరాటి తాతాజీతో పాటు 40 కుటుంబాలు జనసేనలో చేరడం పార్టీపై ప్రజలకు ఉన్న ఆదరణకు నిదర్శనం. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తమ లక్ష్యమని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం ఉంటాయని, గ్రామాభివృద్ధిలో వారందరినీ భాగస్వాములను చేస్తామని" తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు పేపకాయల వీర గోవిందు, తోరాటి తాతాజీ, కార్యకర్తలు మాట్లాడుతూ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ప్రజాదరణ, ఆయన అందిస్తున్న పారదర్శక పాలన చూసే తాము జనసేన పార్టీలో చేరామని తెలిపారు. రాబోయే రోజుల్లో రాజానగరం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ స్థానిక నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

- వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా చర్యలు
- ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి కొండపల్లి



విజయనగరం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): విజయనగరం శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ సిరిమానోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వర్షం కురిసే అవకాశం ఉన్నప్పటికీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా సిరిమానోత్సవాన్ని ముందుగానే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉత్సవానికి వచ్చే భక్తులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ, అధికారుల సూచనలను పాటించాలని కోరారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ప్రశాంతంగా, ఘనంగా జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ఉప్పాడ తీరంపై అర్నబ్ ఏంజా..ఉగ్రరూపంలో సముద్రం!

- తీరాన్ని ముంచెత్తుతున్న రాకాసి అలలు.. రహదారులపైకి సముద్రపు నీరు
- అప్రమత్తమైన అధికారులు.. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ఉప్పాడ , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఉప్పాడ సముద్ర తీరం అతలాకుతలమవుతోంది. తీరంలో సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. సముద్రం ఉగ్రరూపం దాల్చడంతో తీర ప్రాంతంలో పరిస్థితులు ప్రమాదకరంగా మారుతున్నాయి. తీరాన్ని ఆనుకుని ఉన్న రహదారులపైకి సముద్రపు నీరు ఉప్పొంగి వస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల ఉద్ధృతి పెరుగుతుండటంతో తీర ప్రాంత ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తీరాన్ని తాకుతున్న భారీ అలలు, రహదారులపైకి చేరుతున్న సముద్రపు నీటితో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సముద్రం నుంచి వస్తున్న అలల ఉద్ధృతిని దృష్టిలో ఉంచుకుని తీర ప్రాంతంలో అప్రమత్తత అవసరమని అధికారులు సూచిస్తున్నారు. ప్రమాదకర పరిస్థితుల నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగారు. తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైన చోట్ల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపడుతున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సముద్రం ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్ర తీరానికి వెళ్లడం, అలల వద్దకు చేరుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు అధికారులు సూచించే జాగ్రత్తలను పాటించాలని కోరుతున్నారు.

ఎంపీటీసీగా సైనం రామలక్ష్మి శ్రీను ఏకగ్రీవ ఎన్నిక

జగ్గంపేట , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): తూర్పుగోదావరి జిల్లాజగ్గంపేట మండలం జె కొత్తూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి ఘన విజయం దక్కింది. ఎంపీటీసీ స్థానానికి కూటమి పార్టీల బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన సైనం రామలక్ష్మి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం, జగ్గంపేట శాసన సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులు, కృషితోనే ఈ ఏకగ్రీవం సాధ్యమైందని నాయకులు హర్షం వ్యక్తంచేశారు.ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సైనం రామలక్ష్మి శ్రీను మాట్లాడుతూ, తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న జె కొత్తూరు గ్రామ ప్రజలకు, మద్దతు తెలిపిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, పవన్ కళ్యాణ్ సహకారంతో, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో జె కొత్తూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో జె కొత్తూరు గ్రామానికి ఉప సర్పంచ్



గా సేవలందించారు.ఈ ఏకగ్రీవ ఎన్నికతో జె కొత్తూరు గ్రామంలో కూటమి బలం మరోసారి రుజువైందని, గ్రామ ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి ఇదే నిదర్శనవని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

జనసేనలో 50 కుటుంబాలు చేరిక!

అలమూరు , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలో జనసేన పార్టీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, ప్రజాసేవ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతకు ఆకర్షితులై రోజురోజుకూ వివిధ పార్టీల నుంచి జనసేనలో చేరేవారి సంఖ్య పెరుగుతోంది.ఇందులో భాగంగానే తాజాగా గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఆకుల రామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు వైభవోపేతంగా జనసేన పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ విచ్చేసి, నూతనంగా పార్టీలోకి వలస వచ్చిన ప్రతి ఒక్క కుటుంబానికి జనసేన కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ జనసేన పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామంలో ఒకేసారి 50 కుటుంబాలు పార్టీలో చేరడంతో చొప్పెల్లలో జనసేన పార్టీ బలం మరింత పుంజుకుందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలపడటానికి ఈ పరిణామం ఎంతగానో దోహదపడుతుందని స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగుదాం..!

శ్రీకాకుళం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : కూటమి పార్టీ నాయకులంతా సమన్వయంతో ముందుకు సాగి శ్రీకాకుళం తొలి మేయర్ గా విజయం సాధించి జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కానుకగా అందిద్దామని జనసేన నాయకులు నాయకులు దానేటి శ్రీధర్, సుడాచైర్మన్ కొరికాన రవికుమార్ లు శ్రీకాకుళం నగర జనసేన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో జనసేన పార్టీ నగర నాయకులతో కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాలపై కీలక సమాచారం నిర్వహించి వారు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ రాజకీయంగా కీలకంగా మారుందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పదవిని జనసేన పార్టీకి కేటాయించిన నేపథ్యంలో, నగర పరిధిలో పార్టీ బలోపేతం, 60 డివిజన్లలో ఎన్నికల సన్నాహాలు, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంపై పార్టీ నాయకత్వం దృష్టి సారించిందన్నారు. పార్లమెంట్ సమన్వయ కమిటీ, స్థానిక ఎన్నికల అసెంబ్లీ సమన్వయ కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. శ్రీకాకుళం



కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీకి మేయర్ పదవి కేటాయించిన నేపథ్యంలో, ఆ బాధ్యతను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సన్నాహాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపైనా ఉందన్నారు. మేయర్ పదవితో పాటు నగరంలోని 60 డివిజన్లలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ, నాయకుల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా శ్రీకాకుళం నగర అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికను యువత, ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా ప్రయత్నం చేయాలన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో పార్టీ పరిస్థితులను అంచనా వేయడం, స్థానిక సమస్యలను గుర్తించడం, ప్రజల అవసరాలను తెలుసుకోవడం, ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు, జనసేన పార్టీ నాయకులు డా. దానేటి శ్రీధర్ మాట్లాడుతూ, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల దృష్ట్యా పార్టీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మేయర్ పదవితో పాటు 60 డివిజన్ల పరిధిలో ఎన్నికల సన్నాహక కార్యక్రమాలను పక్కాగా నిర్వహించడం, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, నగర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై దృష్టి సారించడం వంటి విషయాలపై చర్చించినట్లు తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి ప్రతి డివిజన్‌లో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటూ, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడంపై సమావేశంలో దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న జనసేన నాయకులు సైతం కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థాయి సమన్వయ కమిటీల మధ్య సమన్వయం కొనసాగిస్తూ, నగరంలోని 60 డివిజన్లలో ఎన్నికల సన్నాహక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏ విధంగా కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకు సాగిందో అదే పంథాలో సాగుతూ ఘన విజయాన్ని నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా, శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ మేయర్ పదవిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, 60 డివిజన్లలో ఎన్నికల సన్నాహాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ సమావేశం నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో జనసేన నాయకులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 29వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన పరిస్థితుల నేపథ్యంలో గంటకు 70–80 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికలు జారీ అయిన నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, రవాణా, పంచాయతీరాజ్, జలవనరులు తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, వర్షాల ప్రభావానికి గురయ్యే గ్రామాలు, నివాస ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక కేంద్రాలను సిద్ధం చేయాలని, అక్కడ తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా అవసరమైన సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని, భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల రహదారులపై చెట్లు పడితే వెంటనే తొలగించేలా జేసీబీలు, ఇతర యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా అప్రమత్తం చేయాలని, పడవలు, వలలను సురక్షిత



ప్రాంతాల్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. వైద్య బృందాలు, అత్యవసర మందులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, ముందస్తుగా మంజూరైన సెలవులను కూడా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా రక్షణ, సహాయక, పునరావాస చర్యలు సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర సమాచారం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు: 0891-2590100, 0891-2590102, జీవీఎంసీ: 1800 4250 0009 ఈపిడిసిఎల్ హెల్ప్ లైన్: 1912 అత్యవసర హెల్ప్ లైన్: 112 నంబర్లను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

జిల్లాలో ఆర్నాబ్ తుఫాను వలన ఎటువంటి ప్రాణ నష్టం జరగకూడదు

ఆర్నాబ్ తుఫాను దృశ్య ప్రజల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : రాబోయే రెండు రోజుల్లో ఆర్నాబ్ తుఫాను తీవ్రత దృశ్య అప్రమత్తంగా ఉండాలని మంగళవారం ఉదయం జిల్లా ప్రజలను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. తుఫాను కారణంగా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలతో మాట్లాడుతూ..... రాబోయే రెండు రోజుల పాటు 'ఆర్నాబ్' తుఫాను కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్) హెచ్చరించిందని తెలిపారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని 6 తీరప్రాంత మండలాల్లో ఉదయం నుంచి వర్షాపాతం మరియు ఈదురుగాలులు తీవ్రమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం గాలి వేగం గంటకు 15 కిలోమీటర్లు ఉండగా, సాయంత్రానికి అది గంటకు 60 నుండి 70 కిలోమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి కాబట్టి అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఎవరూ బయటకు రావద్దని, ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కోరారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఏర్పడినా (చెట్లు పడిపోవడం, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం లేదా ఇతర అత్యవసర సేవలు) సహాయం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ఫిర్యాదు అందిన వెంటనే మండల స్థాయి అధికారుల ద్వారా వేగంగా సహాయక చర్యలు చేపడతారని కలెక్టర్ తెలిపారు. అత్యవసర సహాయం కోసం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 08924-222888 , 08924-225999, 08924-226599, రెవిన్యూ డివిజన్ కంట్రోల్ రూమ్ నెంబర్లు నర్సీపట్నం - 08932224420 అనకాపల్లి - 08924 -223316 అడ్డు రోడ్డు - 089312 93606 విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ నెంబర్లు కసింకోట - 8333810597 అనకాపల్లి - 906311 0544 నర్సీపట్నం - 9491030714

బ్లాస్ట్ బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం

- మృతుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం, దెబ్బతిన్న ఇళ్లకు రూ. 10 వేల చొప్పున నగదు సహాయం, టార్పాలిన్ల పంపిణీ



పాడేరు , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలో రహదారి నిర్మాణ పనుల సందర్భంగా జరిగిన బ్లాస్ట్ ఘటనలో బాధిత కుటుంబాలకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా అండగా నిలిచి తక్షణ సహాయం అందించింది. ఘటనలో మృతి చెందిన ఏడుగురి కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి మొత్తం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, ఇళ్లు దెబ్బతిన్న వారికి కూడా సహాయక చర్యలు చేపట్టారు.

మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం

బ్లాస్ట్ ఘటనలో మృతి చెందిన ఏడుగురి కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఇందులో రూ. 50,000 నగదు రూపంలో, రూ. 4,50,000 చెక్కు రూపంలో కాంట్రాక్టర్ తరపున అందజేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించి, ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా నిలిచేందుకు చర్యలు చేపట్టారు. బ్లాస్ట్ ఘటన కారణంగా ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు తక్షణ సహాయం అందించారు. దెబ్బతిన్న ప్రతి ఇంటికి రూ. 10,000 చొప్పున నగదు సహాయం అందించడంతో పాటు, తాత్కాలిక రక్షణ కోసం సంబంధిత శాఖ ద్వారా టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఇళ్లు దెబ్బతిని ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అర్హులైన బాధిత కుటుంబాలకు పక్కా ప్రభుత్వ గృహాలు మంజూరు చేసేందుకు సంబంధిత అధికారులకు సిఫార్సు చేయనున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు, వారి పునరావాసానికి అవసరమైన చర్యలు చేపట్టడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. బాధితులు ఇబ్బందులు పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

నూకాంబికా ను దర్శించుకున్న మేయర్ అభ్యర్థి

అనకాపల్లి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : విశాఖపట్నం మేయర్ గా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ముక్క శ్రావణి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు మొక్కులు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు అనకావల్లి జీవీఎంసీ ఎన్నికల్లో భాగంగా జీవీఎంసీ టీడీపీ మేయర్ అభ్యర్థి ముక్క శ్రావణి ప్రచారం చేసేందుకు అనకావల్లి వచ్చారు అందులో భాగంగా అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సీ వేపాడ చిరంజీవి గారు,కార్పొరేషన్ చైర్మన్ లు పీలా గోవింద్ సత్యనారాయణ ,మళ్ళా సురేంద్ర ,మాజీ ఎంఎల్సీ బుద్ధ



నాగ జగదీష్,ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను,ఆలయ ఈఓ బుద్ధ నగేష్. మరియు కూటమి పార్టీ నాయకులు,ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

111 వ వార్డులో కొణతాల విస్తృత ప్రచారం

అనకాపల్లి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ 111వ వార్డు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. . ఈ సందర్భంగ వీధులు, పరిసర ప్రాంతాల్లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థి పలకా యశోద రవి తో తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలుసుకొని గెలిపించాలని కోరారు.ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని



కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో కూటమి తరపున ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 111 వ వార్డు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



అనకాపల్లి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : మండల సిపిఎం పార్టీ జడ్పిటిసి అభ్యర్థి కాళ్ళ తేలయ్యబాబు ను గెలిపించాలని సిపిఎం పార్టీ విజ్ఞప్తి చేసింది కొత్తూరు సచివాలయం వద్దగల మార్నింగ్ వాకర్స్ ట్రాక్ వద్ద వాకర్స్ తో మాటమంతి జరపడం జరిగింది. షాపులు, ఇంటింటికి విస్తృతంగా ప్రసారం చేశారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో 19 సంవత్సరాల నిండిన 60 సంవత్సరాల మధ్య ప్రతి స్త్రీకి నెలకి 1500 ఇస్తామని, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, లేదంటే నిరుద్యోగ భృతి 3000 ఇస్తామని, అర్హులైన అందరికీ మూడు సెంట్లు స్థలం, ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థులను ఓడించాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థి కాళ్ళ తేలయ్యబాబు ను గెలిపించాలని కోరారు. అనకాపల్లి మండలంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములు, అక్రమ మైనింగ్ ఖనిజాలను కాజేసిన కూటమి అభ్యర్థులను ఓడించి తమ అమూల్యమైన ఓటును "నుత్తి-కొడవలి-నక్షత్రం" గుర్తుపై వేసి కాళ్ళ తేలయ్యబాబును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, మండల కమిటీ సభ్యులు పెంటకోట శ్రీనివాసరావు, అనకాపల్లి బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు శేఖరమంత్రి సాయి,బి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

జెడ్పీటీసీ నామినేషన్ల ఉపసంహరణకు నేడే తుది గడువు

శ్రీకాకుళం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : జెడ్పీటీసీ నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం తుది గడువు అని జడ్పీ సీఈవో వెంకటరామన్ తెలిపారు. ఇప్పటివరకు 22 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోగా, వారిలో వైసీపీ నుంచి 15 మంది, టీడీపీ నుంచి ఏడుగురు ఉన్నారని వెల్లడించారు. ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించి, ఎన్నికల గుర్తులను కేటాయిస్తామని పేర్కొన్నారు.

తీరవాసులు అప్రమత్తంగా ఉండాలి

రెడ్‌క్రాస్ జిల్లా మేనేజర్ సత్యనారాయణ



శ్రీకాకుళం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : అర్నాబ్ తుపాను నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించుకోవాలని రెడ్‌క్రాస్ జిల్లా మేనేజర్ కె. సత్యనారాయణ సూచించారు. సోమవారం రణస్థలం, ఎచ్చెర్ల, పోలాకి, సంతబొమ్మాళి మండలాల్లోని తీరగ్రామాల్లో సంచార వాహనం, మైకుల ద్వారా అవగాహన కల్పించారు. ఈదురుగాలులు, వర్షాల సమయంలో పాత ఇళ్లు, విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లకు దూరంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెడ్‌క్రాస్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

రైతు సంక్షేమం అభివృద్ధే మా ఎజెండా



పలాస , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): పలాస గ్రామీణ మండలంలో గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి కల్పనే మా ఎజెండా గా ప్రజల్లోకి వెళ్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి బమ్మిడి దుర్యోధనరావు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా వీరభద్రపురం, గరుడకండి, వెంకటాపురం, అనంతగిరి తదితర గ్రామాల్లో ఆయన పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుంటూ, తనకు అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాల కోసం కృషి చేస్తానని వివరించారు. గతంలో చినచల మండల ప్రాదేశిక స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన అనుభవం తనకు ఉందని దుర్యోధనరావు తెలిపారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు, వారి సమస్యలపై స్పందించడం తన రాజకీయ ప్రస్థానంలో కీలకమని చెప్పారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉంటూ ప్రజా సమస్యలపైనే మాట్లాడటం తన విధానమని వివరించారు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన తాను పరిశ్రమను స్థాపించి సుమారు 150 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నానని, పరోక్షంగా మరో 300 కుటుంబాలకు జీవనాధారం లభిస్తోందని తెలిపారు. స్వగ్రామం చినచలతో పాటు గోదారిపురం, రామచంద్రపురం, రాజగోపాలపురం గ్రామాల్లో మంచినీటి సౌకర్యాలు, పాఠశాలల మౌలిక వసతులు, ఆలయాల అభివృద్ధి, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సహాయం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కరోనా సమయంలోనూ సొంత ఖర్చుతో నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని దుర్యోధనరావు తెలిపారు. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సదుపాయాల కల్పనలో రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఎరువుల కొరత ఏర్పడిన సమయంలో ఇతర జిల్లాల నుంచి ఎరువులు తెప్పించి, సొంత నిధులతో రాయితీ అందిస్తూ రైతులకు పంపిణీ చేసినట్లు వివరించారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పు డే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవు తుందని అభిప్రాయపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు, రైతు భరోసా, అమ్మఒడి, ఆసరా, చేయూత, ఆరోగ్యశ్రీ, విద్యా దీవెన వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనాలు అందాయని దుర్యోధనరావు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో పాలనను ప్రజలకు చేరువ చేశారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, పన్నుల భారంపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పలాస ప్రాంతంలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగిస్తూ గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారిస్తానని చెప్పారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దుర్యోధనరావు తెలిపారు. పలాస గ్రామీణ ప్రాంతంలో తాగునీరు, విద్య, వ్యవసాయం, రహదారులు, ఉపాధి వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ సమగ్ర అభివృద్ధి సాధించాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉంగ శార్వాణితో కలిసి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ ప్రచారంలో పలాస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పైల వెంకట్రావు (చిట్టిబాబు), ఉంగ సాయికృష్ణ యాదవ్, వైసీపీ మండల రూరల్ పార్టీ అధ్యక్షులు దువ్వాడ రవి, వైసీపీ కార్యకర్తలు తదితర నాయకులు పాల్గొంటున్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



పలాస , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 32వ వార్డుల్లో జరిగిన అభివృద్ధి పనులను చూసి వార్డు ప్రజలు తనను ఆదరించాలని, మున్సిపాలిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ చైర్మన్ గా పోటీ చేస్తున్న అభ్యర్థి వజ్జ గంగాభవాని తో పాటు 32వ వార్డు నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను వార్డు ప్రజలు ఆశీర్వదించాలని 32 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గురిటి సూర్యనారాయణ కోరారు. 32వ వార్డుల్లో కూటమి నాయకులు కార్యకర్తలు విస్తృతంగా ప్రచారాలు నిర్వహించారు. కూటమి సుపరిపాలనలో వార్డుల్లో సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని, 32వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గోరెటి సూర్యనారాయణ విజయమే లక్ష్యంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజలు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 32వ వార్డు అభివృద్ధికి ప్రజల మద్దతే ప్రధాన బలమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వార్డును మరింత అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

తుపాన్ బాధితుల సహాయం కొరకు మనమిత్ర

విజయవాడ , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తమ ప్రాంతంలో ఎదురవుతున్న సమస్యలు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తెలిపే అవకాశం తుపాన్ సమయంలో కరెంటు సమస్యలు, చెట్లు కూలినా, గోడలు కూలినా, నీళ్లు వచ్చినా ఇంకే సమస్య ఎదురైనా మనమిత్ర ద్వారా అధికారులకు తెలియజేయొచ్చు 9552300009 నెంబరుకు హాయ్ అని మెసేజ్ చేయాలి అక్కడున్న సేవల ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. అర్నబ్ సైక్లోన్ ఇష్యూష్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి రిపోర్ట్ ఇష్యూ ని ఎంపిక చేసుకుని కన్ఫర్మ్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.

పలాస ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం సమిష్టి కృషి



పలాస , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలతోపాటు ఉద్దానం ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూసిన పలాస రైల్వే ఫ్లై ఓవర్ వంతెన పనులు పూర్తయి ప్రజలకు అంకితం చేయడం ఆనందదాయకమని, అయితే ఈ వంతెన నిర్మాణానికి సమిష్టి కృషి కారణమని మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి అన్నారు. పురుషోత్తపురంలో ఏర్పాటు చేసిన పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ చైర్ పర్సన్ అభ్యర్థి బద్రి సీతమ్మ ప్రచార సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2006లో దివంగత నేత హనుమంతు అప్పయ్య దొర ఈ ఫ్లై ఓవర్ వంతెన అవశ్యకతను గుర్తించి అంకురార్పణ చేశారని, 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అప్పటినుండి ఎన్నో బాలరిష్టాలు అధిగమించి పూర్తి చేసుకోవడం వెనుక అందరి నాయకుల సమిష్టి కృషి ఉందని తెలిపారు. 2002లో జరిగిన మొట్టమొదటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారని, కాంగ్రెస్ పార్టీ పరిపాలన కాలంలోనే మున్సిపల్ కార్యాలయం, ముత్యాలమ్మ కోనేరు పార్క్, షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మాణాలు జరిగాయని తెలిపారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాలు భూ కబ్జాలకు నిలయంగా మారాయని, అధికార పక్షం ప్రతిపక్షం వక్రీపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని మొత్తానికి సూది కొండ మాయమైపోయిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం లేదని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బద్రి సీతమ్మను గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఏఐసిసి ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ జీవితేశ్వర రావు మాట్లాడుతూ దివంగత నేతలు అప్పయ్య దొర డాక్టర్ కణితి విశ్వనాథం హయాంలోనే పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పన్నులు భారం వేస్తూ ప్రతి ఏడాది 15% పెంచుకుపోతుందని ప్రజలు దీన్ని గుర్తించాలని అన్నారు. మున్సిపాలిటీకి కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్న అభివృద్ధి శూన్యమని, పార్టీలు ఏదైనా ప్రభుత్వాలు వేరైనా ఎక్కడ కజ్జాలు కామన్ అని అన్నారు. పలాస జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి ఆ ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం విరమించుకోవడంలో ఏ ఏ శక్తులు అడ్డుకున్నాయో జంట పట్టణ ప్రజలకు తెలుసు అని తెలిపారు. పలాస ప్రాంతంలో జీడి కార్మికులు అధికంగా ఉన్న ఎప్పటికీ ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడం దారుణమని అన్నారు. పలాస రైల్వే స్టేషన్ మీదుగా అనేక ఎక్స్ ప్రెస్ రైళ్లు నడుస్తున్న కొన్ని వేలకు ఇక్కడ నిలుపుదల లేదని, ఈ విషయమై కేంద్ర పాలకులు దృష్టి సారించాలని అన్నారు. ఓటు చాలా విలువైనదని, ప్రజల భవిష్యత్తు తీర్చిదిద్దేదని ప్రతి ఒక్కరూ ఆలోచించి సముచిత నిర్ణయం తీసుకోవాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సనపల అన్నాజీ రావు అధ్యక్షుడు జరిగిన ప్రచార సభలో జిల్లా కాంగ్రెస్ పరిశీలకులు మీసాల సుబ్బన్న, సిపిఐ జిల్లా నాయకులు చాపర సుందర్ లాల్, బీన ఢిల్లేశ్వర రావు, కల తిరుమల తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ కు అనపర్తి జిబిఆర్ విద్యార్థి ఎంపిక

అనపర్తి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): ఎస్. జి ఎఫ్ అండర్ 17 క్రికెట్ సెలక్షన్ ట్రైల్స్ అంబాజీపేట హైస్కూల్ గ్రౌండ్ లో నిర్వహించడం జరిగినది. ఈ క్రికెట్ సెలక్షన్స్ లో జి బి ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థి కర్రి కృష్ణ సాకేత్ రెడ్డి ఎంపిక అవ్వడం జరిగింది. ఈ జట్టు వచ్చే నవంబర్ నెల 4,5,6 తేదీలలో మచిలీపట్టణం లో జరిగే స్టేట్ లెవెల్ టోర్నమెంట్ లో పాల్గొనడం జరుగుతుంది. ఈ విద్యార్థి ని కళాశాల ప్రిన్సిపాల్ పి ఆర్ ఎల్ స్వామి, సెక్రటరీ అండ్ కారస్పండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్ద అబ్బాయి రెడ్డి, ఫీజికల్ డైరెక్టర్స్ ఎం వి వి రామారెడ్డి, డేవిడ్ రాజు, విజయ్ బర్న, తల్లి తండ్రులు అభినందించారు.

అడ్డతీగలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల శిక్షణ కార్యక్రమం

అడ్డతీగల , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): రెండో సాధారణ ఎన్నికలు--2026లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు (పి ఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏ పి ఓ) కోసం అడ్డతీగలలో సోమవారం ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు సమర్థవంతంగా వ్యవహరించేలా అవసరమైన అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్, అడ్డతీగల ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగ వెంకట రమణ, తహసీల్దార్ కె.తేజస్విని, ఎంపీడీవో ఏ.వి.వి. కుమార్ పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో నిబంధనలు పాటించాలి

శాంతిభద్రతలకు విఘాతం

కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు : కాశీబుగ్గ డీఎస్పీ జీవీ రమణ హెచ్చరిక



పలాస , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): పలాస మున్సిపల్, పలాస మండల పరిధిలో ఎన్నికల ప్రచారాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కాశీబుగ్గ డీఎస్పీ జీవీ రమణ స్పష్టం చేశారు. ప్రచార సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాయంత్రం కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయ ఆవరణలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు తమ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రజలకు వివరించాలే తప్ప ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలపై దూషణలకు దిగడం, అసభ్యకర పదజాలం ఉపయోగించడం, కులాలు, మతాలు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించడం చేయరాదని డీఎస్పీ సూచించారు. రాజకీయ భేదాభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేయాలని, పరస్పర వాగ్వాదాలు, బెదిరింపులు, ఘర్షణలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, విద్వేషపూరిత సందేశాలు, మార్పులు చేసిన చిత్రాలు, దృశ్యాలను ప్రచారం చేయరాదని తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన సందేశ సమూహాల నిర్వాహకులు తమ సమూహాల్లో అభ్యంతరకరమైన, రెచ్చగొట్టే సందేశాలు వ్యాప్తి చెందకుండా పర్యవేక్షించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో చేసే వ్యాఖ్యలు, ప్రచారం చేసే సందేశాల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహించేవారు ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించి, అవసరమైన అనుమతులు పొందాలని డీఎస్పీ తెలిపారు. ప్రచార కార్యక్రమాల్లో డీజే వినియోగానికి సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, డీజే వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాన్ని ఉల్లంఘించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమాల వల్ల ప్రజల రాకపోకలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థుల పట్ల పోలీసు శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని జీవీ రమణ తెలిపారు. ఫిర్యాదులు, లభ్యమయ్యే ఆధారాల మేరకు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కడైనా ఘర్షణలు, బెదిరింపులు లేదా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే ప్రజలు స్వయంగా జోక్యం చేసుకోకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, పుకార్లను నమ్మకుండా ధ్రువీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయరాదని కోరారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, కార్యకర్తలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ పట్టణ సీఐ ఎం. అప్పారావు, కాశీబుగ్గ గ్రామీణ సీఐ తిరుపతిరావు, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రభుత్వాలు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

ఇచ్ఛాపురం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉత్తరాంధ్రలోని చివరి ప్రాంతంగా, ఒడిశా సరిహద్దుకు ఆనుకుని ఉన్న ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రభుత్వాలు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ మున్సిపాలిటీలో ప్రజలకు తాగునీరు, నాణ్యమైన రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికలకు ముస్తాబవుతున్న ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు మారుతున్నా, ఇచ్ఛాపురం ప్రజల సమస్యలు మాత్రం ఎందుకు పరిష్కారం కావడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సిపాన గుణవతి ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీ నాయకులు ఎల్ గోవిందరాజులు, పిట్ట పోలయ్య, మద్దు సోమశేఖర్ యాదవ్ వైస్ రాజు మురళి, బంగారి విశ్వనాథం, సాలిన ఫిల్లీ రావు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల పర్యటించి, పట్టణ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, నిధుల వినియోగం వంటి అంశాలపై దృష్టి సారించింది. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరాయంగా అందించడం ఏ మున్సిపాలిటీ అయినా నిర్వహించాల్సిన ప్రాథమిక బాధ్యత. కానీ ఇచ్ఛాపురంలో తాగునీటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయని కమిటీ నిర్ధారించింది నీటి సరఫరా కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితులు



ఏర్పడటం పట్టణ మౌలిక సదుపాయాలపై పునఃసమీక్ష అవసరాన్ని తెలియజేస్తోంది. జనాభా పెరుగుతున్న కొద్దీ నీటి అవసరాలు పెరుగుతున్నప్పటికీ, పాత పైపులైన్లు, నీటి నిల్వ సామర్థ్యం, పంపిణీ వ్యవస్థలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేశారా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపట్టిన మంచినీటి పథకాలు ఏ దశలో ఉన్నాయి? వాటి ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు ఎప్పుడు అందుతుంది? అనేది ప్రశ్నార్థకంగా ఉందని కమిటీ పేర్కొంది ప్రజల దాహాన్ని తీర్చలేని అభివృద్ధి ప్రణాళికలు ఎవరికి ఉపయోగపడతాయనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. రహదారులపై గోతులు.. ప్రమాదాలకు ఆహ్వానం! పట్టణంలో రహదారుల పరిస్థితి, గుంతలు, మురుగునీటి పారుదల సమస్యలు ప్రజల దైనందిన ప్రయాణాలకు ఆటంకంగా మారుతున్నాయనే అంశాలను కమిటీ పరిశీలనకు తీసుకుంది. రహదారులు దెబ్బతింటే ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అత్యవసర వైద్య సేవలు పొందాల్సిన రోగులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచిపోవడం, గుంతలు మరింత ప్రమాదకరంగా మారడం వంటి సమస్యలను ముందుగానే పరిష్కరించాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాం.గం ప్రజా ప్రతినిధులపై పై ఉంది. అభివృద్ధి పనుల పేరుతో నిధులు మంజూరవుతున్నప్పుడు, వాటి ఫలితాలు ప్రజలకు ఎందుకు కనిపించడం లేదు? రహదారుల నిర్మాణానికి కేటాయించిన నిధులు ఎంత? ఎన్ని పనులు పూర్తయ్యాయి? నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అసంపూర్తి పనులకు బాధ్యత ఎవరిది? ఈ సమస్యలపై కమిటీ ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్ తో సమావేశమై చర్చలు జరిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఎక్కడికి వెళ్తున్నాయి? మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయిస్తాయి. తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్యం, పార్కులు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ అమృత 2.0 పథకం కింద ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి బలహీనవర్గాల గృహ కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం రూ. 4.98 కోట్లు, 192 గృహాలకు అంతర్గత నీటి సరఫరా కోసం రూ. 1.12 కోట్లు, కోటేరు బంధా చెరువు పునరుద్ధరణకు రూ. 1.41 కోట్లతో కూడిన ప్రాజెక్టులు అధికారిక ప్రాజెక్టుల జాబితాలో నమోదయ్యాయి. ఈ పనుల అమలు స్థితి, పురోగతి, పూర్తిస్థాయి ప్రయోజనాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అన్న అంశాలను సంబంధిత అధికారులు స్పష్టం చేయాలి. నిధులు మంజూరవడం ఒక ఎత్తయితే, అవి సకాలంలో వినియోగమై ప్రజలకు ఫలితాలు అందడం మరో ఎత్తు. కాగితాలపై కనిపించే అభివృద్ధి కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించే అభివృద్ధే ప్రజలకు ముఖ్యం. ఆంధ్రప్రదేశ్‌కు చివరి ప్రాంతంలో, ఒడిశా సరిహద్దుకు ఆనుకుని ఉన్న ఇచ్ఛాపురం భౌగోళికంగా, వాణిజ్యపరంగా, రవాణాపరంగా ప్రాధాన్యత కలిగిన పట్టణం. ఇలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అంశం కూడా. ఇచ్ఛాపురం ప్రజల సమస్యలకు పరిష్కారం చూపకుండా అభివృద్ధి జరిగిందని చెప్పడం అర్థరహితం. ఇకనైనా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ పాలకవర్గం బాధ్యత తీసుకుని పట్టణానికి న్యాయం చేయాలి. ప్రజాధనానికి లెక్క ఉండాలి.. అభివృద్ధికి గడువు ఉండాలి.. ప్రభుత్వ హామీలకు జవాబుదారీతనం ఉండాలి. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ జాతీయ సంక్షేమ సంఘం శుభాకాంక్షలు తెలుపుతుందని డాక్టర్ గుణవతి తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపిస్తే నిడదవోలును మరింత అభివృద్ధి చేస్తాం : మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తే నిడదవోలు పట్టణంలో క్షేత్రస్థాయిలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, కూటమికి ఓటేసి అభివృద్ధిని గెలిపించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రజలను కోరారు. నిడదవోలు పట్టణంలోని 12వ వార్డు బసివిరెడ్డి పేటలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి మురాల జ్యోతి, కూటమి నాయకులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సంబంధిత వార్డు కూటమి అభ్యర్థి అడ్డాల రమ్య (జనసేన) తరపున ఓటర్లను కలిసి మద్దతు కోరారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకు వివరించారు. వార్డులో తిరుగుతూ పట్టణ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ స్థానిక ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..కేంద్ర సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో నిడదవోలు పట్టణంలో రూ.195 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ, ప్రధాన రహదారుల నిర్మాణం, చెరువుల నుందరీకరణ వనులు చేపట్టామని,చినకాశీరేవు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. డిసెంబర్ నాటికి ఆర్‌వోబీ ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని, అలాగే ఆర్టీసీ బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తామని,'అమృత్ 2.0' పథకం ద్వారా గోదావరి శుద్ధజలాలను పట్టణంలోని ప్రతీ ఇంటికి అందిస్తామని హామీ ఇచ్చారు.. గత వైసీపీ ప్రభుత్వం అమృత్ నిధులను పక్కనపెట్టి, రోడ్ల మరమ్మతులకు తట్టెడు మట్టి కూడా వేయకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించింది.కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలోనే 'హైబ్రిడ్ యాన్యుయిటీ మోడల్' కింద అత్యధికంగా రూ.45 కోట్ల నిధులు తీసుకొచ్చామని, పుష్కరాల నిర్వహణ కోసం రూ.7 కోట్లు మంజూరయ్యాయని, .అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు'లో భాగంగా రూ.3.62 కోట్లతో తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ ఆలయంలో భక్తులకు వసతి గదులు, శెట్టిపేట గోదావరి కెనాల్ వద్ద బోటింగ్, పిల్లల పార్క్, వేసైడ్ రెస్టారెంట్, చినకాశీరేవు ఘాట్ల ఆధునికీకరణ, నిత్యహారతి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.పట్టణ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేశామని, ఎన్నికల అనంతరం అమలు చేస్తామని ఆయన తెలిపారు.టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు, తాను కలిసి నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు 20 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులు తీసుకొచ్చి బాధితులకు లబ్ధి చేకూర్చామని వివరించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పాటు స్థానిక సంస్థలలోనూ కూటమి పాలన తోడైతే నిడదవోలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని మంత్రి దుర్గేష్ అన్నారు. చారిత్రాత్మకమైన నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లో నంబర్ 1గా తీర్చిదిద్దేందుకు ప్రజలు కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు.వైసీపీ ప్రభుత్వంలా అబద్ధాల హామీలు తమకు రావు... అభివృద్ధి చేసి చూపించడమే తమకు తెలుసని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

పోలీసు కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు



రాజమహేంద్రవరం, , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ జిల్లా పోలీసు కార్యాలయంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి, భారతీయ సంస్కృతి, ధర్మం, నైతిక విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహర్షి వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన పేర్కొన్నారు.ఆయన బోధనలు సమాజంలో సత్యం, ధర్మం, మానవతా విలువలను పెంపొందించేందుకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని తెలిపారు. మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్ , స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి. రామకృష్ణ, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ పి.ఈ. పవన్ కుమార్ రెడ్డి , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, ఆర్ఐలు పి. సంజీవ్ కుమార్, జి.త్రినాథ్రావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల విధులపై అధికారులకు దిశానిర్దేశం : ఆర్వో ప్రేమ్ కుమార్



అనపర్తి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నియమించబడిన వివిధ బృందాల అధికారులు ఎన్నికల నిబంధనలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారి ప్రేమ్ కుమార్ ఆదేశించారు. అనపర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల విధులకు సంబంధించిన సమీక్షా సమావేశం నిర్వహించారు.రాబోయే పరిషత్ ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి బృందం, స్థిర నిఘా బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు, జోనల్ అధికారులు,రూట్ అధికారులతో రిటర్నింగ్ అధికారి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, నిఘా బృందాల విధులు, అనుసరించాల్సిన చట్టపరమైన విధి విధానాలపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అనపర్తి ఎంపీడీఓ మండ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్ కుమార్ మరియు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ విద్య



అనపర్తి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య హెచ్చరించారు. అనపర్తి చిర్ల తిలక్ రెడ్డి వర్తకసంఘం కళ్యాణ మండపంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులతో నమీక్ష నమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా డీఎస్పీ విద్య మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో భాగంగా లౌడ్ స్పీకర్లు, మైకులు వినియోగించే వారు తప్పనిసరిగా పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి అన్నారు.నిర్ణీత సమయం తర్వాత మైకులు వాడకూడదు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలకు దిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, అసత్య వార్తలు పోస్ట్ చేసినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలి అని సూచించారు.ఈ సమావేశంలో అనపర్తి సీఐ సుమంత్, ఎస్ఐ వినయ్ ప్రతాప్, అదనపు ఎస్సై సుజాత, టీడీపీ, జనసేన, బీజేపీ, వైఎస్ఆర్సీపీ నాయకులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జన్మదినోత్సవ వేడుకలు



అడ్డతీగల , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : అడ్డతీగలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి జీవితం యావత్తు సమాజానికి ఆదర్శనీయమని మండల వాల్మీకి సంఘం కన్వీనర్ నడిగట్ల. రమేష్ బాబు అన్నారు. అడ్డతీగల మండల కేంద్రంలో గల వాల్మీకి మహర్షి జన్మదినోత్సవ వేడుకలను సోమవారం సంఘం నాయకులు మిర్తివాడ. రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల సంఘం నాయకులు బోండ్ల. ప్రభాకరరావు, మద్దికొండ. రాజేశ్వరరావు ల సౌజన్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత వాల్మీకి మహర్షి విగ్రహానికి సంప్రదాయ బద్దంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బోండ్ల .ప్రభాకర్ రావు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం అన్నారు. వాల్మీకి మహర్షి తొలుత ఒక దారిదోపిడి విధానంలో జీవించినట్లు పేర్కొన్నారు.అప్పుడు ఆయన పేరు రత్నాకరుడు అని తదనంతరం వాల్మీకిగా ప్రాచుర్యం పొందినట్లు స్పష్టం చేశారు. వాల్మీకం అంటే సంస్కృతంలో పుట్ట అని రత్నాకరుడుగా ఉన్న ఆయన తపస్సు చేస్తూ తన చుట్టూ పుట్టలు చేరినట్లు పేర్కొన్నారు. అందుకే వాల్మీకి అనే పదం వచ్చినట్లు తెలిపారు. ఆ సంతానమే నేటి సమాజంలో నివసించే వాల్మీకి తెగ సమాజం అన్నారు. నేడు వాల్మీకి జాతి ఐక్యతగా ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మిర్తివాడ సూర్యారావు, మాజీ ఎంపీటీసీ పుడిగి. ఆదిలక్ష్మి, పుడిగి బాలేసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దశిగేటి .సత్తిబాబు, జనసేన చోళ్ళ. కృష్ణారెడ్డి, మిర్తివాడ. నరేష్,లమ్మసింగి .గంగరాజు, శివ, పుడిగి .మాణిక్యం, బొంకు. వజ్ర కుమారి, మామిడి. నారాయ ణమ్మ, పుడిగి. రవికుమార్, బోండ్ల. రాజశేఖర్, సువర్ణ కుమార్, దుర్గ సోమశేఖర్, దుమంతు. దుర్గ ప్రసాద్, మామిడి. సోమేశ్వర రావు ,బాలకృష్ణ, ముర్ల. విద్యాసాగర్, తాళ్లూరి. నరేష్, గుడ్ల .సత్యనారాయ ణ, బొంకు. రాజేష్ అధిక సంఖ్యలో వాల్మీకి తెగస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుళ్ళలో భారీ అన్న ప్రసాద వితరణ




కడియం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : కడియం మండలం, దుళ్ళ గ్రామం సంత మార్కెట్ వద్ద వేంచేసిఉన్న శ్రీ శారదాదేవి ఆలయం వద్ద, దేవీ నవరాత్రులు 50వ సంవత్సరం ముగింపును పురస్కరించుకుని 12 గంటల నుండి భారీ ఎత్తున అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం జరిగింది. మహిళలకు వేరే లైన్ ఏర్పాటు చేశారు.గ్రామం నుండే కాకుండా ఇతర గ్రామాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్నిపూర్వపు కమిటీ సభ్యులు తాతపూడి బాబిసలహాలు,సూచనలతో ప్రస్తుత కమిటీ సభ్యులు చందన నత్తి బాబు,తొట్ట నత్తిబాబు,కవిలి సతీష్,కోరుప్రోలు పుల్లం,,మిద్దె వీర బాబు,దుబాయ్ నత్తి బాబు, ఇమ్మంది నతీష్,పచ్చిపులుసు సుందరబాబు,పుచ్చల శ్రీను,షేక్ మాబు,మాడ వెంకటేశ్వరరావు (ఎర్రబ్బు),మందపల్లి సోమరాజు, చెరుకూరి శ్రీనివాస్ చౌదరి,వారణాసి వెంకయ్య, సప్లైకంపెనీ నాగరాజు పర్యవేక్షించారు.

చిన్నజీయర్స్వామిమంగళా శాసనాలతో భక్తులకు పులకింత



జగ్గంపేట , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటలో త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి 70వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జగ్గంపేటలో వికాస తరంగిణి జగ్గంపేట శాఖ ఆధ్వర్యంలో గత 90 రోజులుగా నిర్వహిస్తున్న ఇంటింటా సత్సంగ పారాయణం నేడు ఘనంగా ముగిసింది. సాయంత్రం 5.30 గంటలకు రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు), కొత్త మాధురి దంపతుల స్వగృహంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో భక్తులు యతిరాజ వింశతి, తాటిపంచకం, లక్ష్మీ అష్టోత్తర శత నామ స్తోత్రం, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.90 రోజుల పాటు తమ ఇళ్లలో సత్సంగం నిర్వహించిన భక్తులకు స్వామి వారి మంగళాశాసనాలు అందజేశారు. భక్తులందరూ స్వామి వారి ఆశీస్సులు అందుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో 90 రోజులు జరిగిన ప్రతి ఇంటి నుంచి మహిళ భక్తులు విచ్చేసి అన్ని పారాయణాలు భక్తిశ్రద్ధలతో పఠించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



రాజమహేంద్రవరం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : భారీ నుంచి అతి భారీ వర్షాలు, తుపాను ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన అత్యవసర సమీక్ష, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలు మేరకు తూర్పు గోదావరి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా నిబంధనలను పాటిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ఈనెల 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు.కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, సహాయ కలెక్టర్ కె ఆదిత్య శర్మ పాల్గొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా భారీ అతి భారీ వర్షాలు నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించి ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించి జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచాలని, వర్షాలు, వరదల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, వాగులు, వంకలు, నదీ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, పునరావాస కేంద్రాలను సిద్ధం చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, రహదారులకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని, అత్యవసర సేవలను అందించేందుకు సిబ్బంది, అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు, భద్రతా సూచనలు అందించాలని పేర్కొన్నారు.భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లాలో స్థానిక సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రెండు రోజులు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేయాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఈ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా తక్షణమే స్పందించాలని ఆదేశించారు.జిల్లాలో చేపట్టిన ముందస్తు చర్యలు, శాఖల వారీగా సంసిద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు. అత్యవసర కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు - జిల్లా కలెక్టరేట్, రాజమహేంద్రవరం: 08832-944455 - సబ్ కలెక్టర్ కార్యాలయం, రాజమహేంద్రవరం: 08832-442344 - ఆర్డీవో కార్యాలయం, కొవ్వూరు: 08813-231488 భారీ వర్షాలు, వరదలు, నీటి నిల్వలు, రహదారులపై ఇబ్బందులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు సంబంధిత కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అధికార యంత్రాంగం నుంచి వెలువడే హెచ్చరికలు, సూచనలు పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

పినపళ్లలో వైసీపీ నుండి టీడీపీలోకి ఎమ్మెల్యే సమక్షంలో భారీ చేరికలు!



అలమూరు , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త) : అలమూరు మండలం పినపళ్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ బలంగా పుంజుకుంటోంది. గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.పినపళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీకి చెందిన చోడిశెట్టి కాసు, చోడిశెట్టి దుర్గారావు, తోరాటి వీర్రాజు, తోరాటి రుద్రయ్య, యేపూరి వీరబాబు, కోట ధనరాజు, పిల్లి శ్రీనివాస్, ఇల్లూరి సురేష్‌లతో పాటు పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున టీడీపీ వైపు వస్తున్నారని తెలిపారు. పినపళ్ల గ్రామాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని, కొత్తగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత, సముచిత గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వంగవీటి రాధాకృష్ణ కి మద్దతుగా ప్రచారం చేసిన ఆకుల రామకృష్ణ



రావులపాలెం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ అభ్యర్థిగా ఎన్డీఏ కూటమి తరుపున పోటీ చేస్తున్న వంగవీటి రాధాకృష్ణ ను వారి ఎన్నికల కార్యాలయంలో కలిసి, భారీ మెజార్టీతో గెలవాలని, ఆశీర్వదించిన రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ. వంగవీటి రాధాకృష్ణ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ రాష్ట్ర కాపు జే ఏ సి నాయకులు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి, ఉద్యమనేత ఆకుల రామకృష్ణ, రాష్ట్ర కాపు జే ఏ సి నాయకులు ఆరేటి ప్రకాష్, వాసిరెడ్డి ఏసుదాసు, ఎన్. ఎస్. రాజు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేస్తున్న 60వ డివిజన్ కార్పొరేటర్ గా పోటీ చేస్తున్న నెల్లి బండ్ల బాలస్వామి తరపున, 81 డివిజన్ నుండి కార్పొరేటర్ గా పోటీ చేస్తున్న పందిరి నాగమణి వాసు తరపున, 85వ డివిజన్ కార్పొరేటర్ గా పోటీ చేస్తున్న వంటే వెంకటేశ్వరరావు తరపున, విజయవాడ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు కేశినేని చిన్ని తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. విజయవాడలో ఏ.పీ.యూ. డబ్ల్యూ. జె (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్) ప్రెస్ క్లబ్లో పాత్రికేయుల సమావేశంలో ఆకుల రామకృష్ణ, రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం అస్తవ్యస్త పరిపాలన చేసిందని, చెత్త పై కూడా పన్ను వేసిందని, పరిశ్రమలను లేకుండా చేసిందని, ల్యాండ్ టైటిల్ డిడి యాక్ట్ పెట్టి మన పొలాలు మన స్థలాలు మనకు కాకుండా చేసే ప్రయత్నం చేసిందని, అరాచకం సృష్టించిందని, పంచాయతీల వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, అన్నా క్యాంటీన్ లను మూసివేసిందని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేస్తుందని, పోలవరం ప్రాజెక్టును అటకెక్కించిశీదని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాలన గాడిలో పడిందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, పాలనా వ్యవస్థలను గాడిలో పెట్టారని, గతంలో పంచాయతీ వ్యవస్థ 27 స్థానంలో ఉండేదని, పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వ్యవస్థని భారత దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలిపారని, 2024 వ సంవత్సరంలో 13,625 పంచాయతీలకు ఒకే రోజున గ్రామసభలు ఏర్పాటు చేశారనీ, 2025, 2026 వ సంవత్సరంలో కూడా గ్రామసభలు ఏర్పాటు చేసి కేంద్రం నుండి అనేక నిధులు తీసుకువచ్చి, పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టారని, మున్సిపాలిటీలను పి నారాయణ బలోపేతం చేశారని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, అనేక రోడ్లు వేశారని, రైతులకు సకాలంలో డబ్బులు జమ చేస్తున్నారని, అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నారని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారని, అటువంటి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కాపు జే ఏ సి నాయకుడు కోరారు. ఈ కార్యక్రమంలో రవిరామ్ టీవీ చానల్స్ చైర్మన్ చింతల రామారావు (బాబి), చింతల రవి కుమార్ (చంటి) వాసిరెడ్డి జ్యోతి బాబు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

ఆధార్ కార్డుతో సబ్సిడీ బియ్యం పొందవచ్చు : అరిగెల బలరామమూర్తి

కొత్తపేట , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లలో ధరణి రైస్ సబ్సిడీ ధరకు విక్రయిస్తున్నారా లేదా అనే విషయంపై రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు అరిగెల బలరామమూర్తి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు బజారులో 26 కిలోల ధరణి బియ్యం రూ. 1,250కు, అంటే కిలో రూ.49 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇదే రకం బియ్యం బహిరంగ మార్కెట్లో రూ. 2,000 వరకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని కొత్తపేట పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జోరుగా సాగుతున్న కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం!





అనపర్తి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): అనపర్తి మండలంలో కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం అత్యంత ఉత్సాహంగా, హోరెత్తేలా సాగుతోంది.స్థానిక ప్రజల నుంచి అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతూ,అపూర్వ స్పందన లభిస్తోంది.మండలంలో రామవరం గ్రామంలో కూటమి తరపున పోటీ చేస్తున్న ప్రధాన అభ్యర్థులు పాల్గొని ఓటర్లను కలిసి తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ అభ్యర్థి వాసంశెట్టి నాగేశ్వరరావు, ఎంపీటీసీ-1 అభ్యర్థి మండ లక్ష్మి ప్రసన్న దేవి (సతీష్ రెడ్డి) ఎంపీటీసీ-2 అభ్యర్థి తేనెల శ్రీనివాస్, అనపర్తి టౌన్ లో కర్రి శేషారత్నం ప్రచారం.దీనిలో భాగంగానే అనపర్తి ఎంపీటీసీ-6 కూటమి అభ్యర్థిని కర్రి శేషారత్నం పట్టణ పరిధిలోని నల్ల కాలువ, మసీదు సెంటర్, తురక వీధి పరిసర ప్రాంతాలలో ఎన్నికల ప్రచార కార్యక్రమం ఉధృతంగా నిర్వహించారు.

స్థానిక మైనారిటీ సోదరులు, మహిళలు, ఓటర్లను కలిసి కూటమి ప్రభుత్వం ద్వారా జరిగే అభివృద్ధిని వివరిస్తూ ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో అనపర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి నేతృత్వంలో కూటమి నాయకులు,భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు. ఆయా వీధుల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. “ప్రజల ఆశీస్సులతో... అభివృద్ధి లక్ష్యంగా... కూటమి విజయమే ధ్యేయంగా” తాము ముందుకు సాగుతున్నామని, ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్ లో దాక్కుని ప్రెస్ మీట్లా? : జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తిరస్కరిస్తారనే అభద్రతాభావంతో పులివెందుల ఎమ్మెల్యే జగన్ మతిభ్రమించి తాడేపల్లి ప్యాలెస్ లో దాక్కుని రోజుకో ప్రెస్ మీట్ పెడుతున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ తీవ్రంగా విమర్శించారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రజల మధ్యకు వెళ్లి రెండున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ దూసుకు పోతుంటే, జగన్ ప్రజల మద్దతు కూడగట్టలేక ప్రజాస్వామ్యం ఖూనీ అయిందంటూ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. సాక్షాత్తు తన సొంత నియోజ కవర్గం పులివెందులలోనే కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నారని, ఇది జగన్ కు చెంపపెట్టు అని అన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఎలాంటి అరాచకాలు సృష్టించిందో ఒక్కసారి మీడియా క్లిప్పింగ్స్ తెచ్చుకుని చూసుకోవాలని జగన్ కు హితబోధ చేశారు.ఇప్పటికైనా కళ్లు తెరుచుకుని ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడగాలని, కూటమి ప్రభుత్వం తప్పులు చేస్తే వాటిని ప్రజల్లో చెప్పాలని తప్ప తాడేపల్లిలో కూర్చుని అబద్ధపు ప్రెస్ మీట్లు పెడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.రాష్ట్రంలో నిత్యావసర ధరల స్థిరీకరణ కోసం ప్రభుత్వం రైతు బజార్లు, ప్రభుత్వ అవుట్ లెట్ల ద్వారా ప్రజలకు తక్కువ ధరకే నిత్యావసర వస్తువులు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందని జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, గోకవరం మండల టిడిపి అధ్యక్షులు పీల్లా చంటిబాబు, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం



సీతానగరం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): సీతానగరం మండలం వంగలపూడి గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ ప్రచారంలో భాగంగా సీతానగరం మండలం జెడ్పీటీసీ అభ్యర్థి బత్తుల వెంకటలక్ష్మి, సీతానగరం ఎంపీపీ అభ్యర్థి గద్దె మాధవి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.గ్రామానికి విచ్చేసిన అభ్యర్థులకు వంగలపూడి గ్రామ ప్రజలు, మహిళలు, నాయకులు పూలమాలలతో, మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభ్యర్థులు వీధి వీధినా తిరుగుతూ ఓటర్లను కలిసి, తమను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల సమగ్ర అభివృద్ధే ముఖ్య ధ్యేయమని పేర్కొన్నారు. గెలిచిన వెంటనే సీతానగరం మండలంతో పాటు వంగలపూడి గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని అభ్యర్థులకు తమ పూర్తి మద్దతును తెలిపారు.

జగన్ హయాంలో అన్ని బలవంతపు ఏకగ్రీవాలే : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



రావులపాలెం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికలు అడ్డుకోవాలని జగన్ కుట్రలు పన్నుతున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ కు తెలుసిందంతా కూడా శవరాజకీయాలే రాజకీయలే. విలువలు తెలియదు దౌర్జన్యాలు అక్రమాలు దాడులు ఇవే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యొక్క రాజకీయ అస్త్రాలు. మరి ఈనాడు ప్రజాస్వామ్యయుతంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించబడుతా ఉంటే ఆ ఎన్నికలు అడ్డుకోవడానికి వైఎస్సార్సీపీ నాయకులు తీవ్రమైన కుట్రలు పన్నుతూ, అనేక నాటకాలకు తెరలేపుతున్నారు. ఆఖరికి వాళ్ల నామినేషన్ పత్రాలను వాళ్లే చించేసుకుంటున్నారు. శాంతి భద్రతల పరిరక్షించాల్సిన పోలీసుల మీద కూడా దాడులు చేస్తున్నారు. మరి వారి తీరు చూస్తా ఉంటే ఒక దండుపాల్యం ముఠాలా కనపడతా ఉంది. ఆనాడు వైసీపీ ప్రభుత్వం హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ విధంగా జగన్ మోహన్ రెడ్డి వ్యవహరించాడనేది ప్రజలు మర్చిపోయారేమో అని అనుకుంటున్నారు. ఆనాడు ఏ విధంగా బరువంతపు ఆక్రమాలు జరిగాయి, దౌర్జన్యాలు జరిగాయి, దాడులు జరిగాయి, హింస జరిగిందనేది రాష్ట్ర చరిత్రలో ఏనాడూ కూడా స్థానిక ఎన్నికల వేళ అటువంటి దుర్మార్గాలు జరగడం ఎవరు చూడలేదు. మరి ఈనాడు ఎంతో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఒకపక్క ఈ రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలని చంద్రబాబు నాయుడు కృషి చేస్తా ఉంటే ఈ రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చాలనే ఆలోచనతోటే జగన్ మోహన్ రెడ్డి ఉండటం దురదృష్టకరం. ఏ నాయకుడికైనా ఎవరికైనా రాష్ట్రం పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల చిత్తశుద్ధ ఉండాలి. రాష్ట్రం బాగుపడాలి, ప్రజలు బాగుండాలని కోరుకోవాలి. చంద్రబాబునాయుడు పాలన ప్రజలందరూ కూడా హర్షిస్తూ, సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని ఏ విధ విధంగా ఇబ్బందులు పాలు చేయాలి బురద చల్లాలి అని స్థానిక ఎన్నికల అడ్డం పెట్టుకొని అనేక రకాలుగా సమస్యలు సృష్టిస్తూ ఉన్నారు. మరి శాంతి భద్రతల గురించి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతున్నారంటే చాలా విడ్డూరంగా ఉంది. అసలు ఆనాడు వైసీపీ ప్రభుత్వంలో శాంతి భద్రతలు ఉన్నాయా? కక్షలు, వేధింపులు, అర్ధరాత్రి అరెస్టులు. శనివారం వచ్చిందని తప్ప, ఆదివారం వచ్చిందని తప్ప ఎక్కడ ఎవరి ఇల్లు, ఏది కూల్చేస్తారో తెలియనటువంటి పరిస్థితి ఆనాడు మనం చూశాం. అక్రమ అరెస్టులు చూశాం. అలాగే వైసీపీ పార్టీ గొడ్డలి పార్టీ అంటున్నాం ఇప్పుడు, ఎందుకంటే ఆ పార్టీ యొక్క జరిగినన్ని సంఘటనలు చూస్తా ఉంటే. ఒక క్రిమినల్స్ ని తయారు చేసే ఫ్యాక్టరీలా తయారైంది వైసీపీ పార్టీ. మరి ఏకగ్రీవాల గురించి గతంలో పొంగనూరులో ఏం జరిగింది? రాయచోటిలో ఏం జరిగింది? పులివెందులలో ఏం జరిగింది? మర్చిపోయారా మీరు? ఆనాడు ఏ విధంగా మీరు వ్యవహరించారు? ఆ రాజకీయాలు ఏ విధంగా చేశారు? ఇప్పుడు కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకి అన్యాయం చేయడానికి, బీసీ వర్గాల వారికి రిజర్వేషన్లు అమలు కాకుండా ఉండడానికి లేదా రాష్ట్రానికి వస్తున్నటువంటి నిధులు రాకుండా అడ్డుకోవడానికి పన్నెండు వేల ఆరు వందల కోట్ల రూపాయలు కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోతే ఆ నిధులు రాకుండా చేయాలనే దురుద్దేశంతోటి బీసీ వర్గాల వారికి రిజర్వేషన్లు అందుకోకుండా 34 శాతం రిజర్వేషన్లు దక్కకుండా ఉండడం కోసం ఎన్ని కేసులు వేశారు. యాభై తొమ్మిది కేసులు మీరు కోర్టులో వేశారే వాటన్నింటినీ కూడా అధిగమించి బీసీలకి 34 శాతం ఇస్తున్నాం. రిజర్వేషన్ల కంటే కచ్చితంగా ఇంకా రిజర్వేషన్లు కల్పిస్తూ ఈనాడు ఎన్డీఏ కోటమి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధపడుతా ఉంటే మీరు రకరకాలుగా మాట్లాడుతున్నారు. మీ గురించి ప్రజలకు చెప్పక్కర్లేదు, మీ తల్లిని అడిగితే చెప్తారు. మీ సొంత చెల్లిని అడిగితే చెప్తారు. మీరు ఏమిటనేది. వాళ్ళు వేధించి ఏ విధంగా మీరు మానసిక ఆనందం పొందుతూ ఉన్నారనేది ఈ మధ్యనే మేనకోడలు పెళ్లి చేసుకుంటానంటే కూడా మేనకోడలు పెళ్లి కూడా మీ యొక్క ఎలవంక పాలెస్ కోసం ఏ విధంగా వ్యవహరించారో ప్రజలు గమనిస్తున్నారు. ఎవరైనా గాని తండ్రి తర్వాత తండ్రిలా భావిస్తారు మేనమామని మరి ఈ మేనమామ, మేనకోడలు పెళ్లికి అడ్డుపడి ఒక కంసమామలా తయారయ్యాడనేది ఈనాడు మనం చూస్తా ఉన్నాం. శాంతి భద్రతల సమస్య చెప్తున్నారు మీరు. తాడేపల్లి పాలెస్ లో ఆనాడు శాంతి భద్రతల సమస్య కనపడలేదా? ఈనాడు ఎలహంకా పాలెస్ మీ ప్యాలెస్లో మీ సొంత మేనకోడలు పెళ్లికి కూడా మీరు సహకరించకుండా దుర్మార్గంగా వ్యవహరించడం మీ యొక్క నీచ వైఖరిని తెలియజేస్తా ఉంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో మీరు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ఏకగ్రీవాలు జరిగితే వైసీపీ నుండి టిక్కెట్లు ఇవ్వనన్నారు. మరి మీకు ఈనాడు పులివెందులలో ఇరవై వార్డుల ఏకగ్రీవమయ్యాయి. మీ జిల్లాలోనే ఒక ఆరు మున్సిపాలిటీలు ఏకగ్రీవమయ్యాయి. మీరు పులివెందుల నుంచి తప్పుకుంటారా అని నేను ప్రశ్నిస్తా ఉన్నాను. అంటే మరి పులివెందులలో ఇరవై వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మీ జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు ఏకగ్రీవమయ్యాయి. మరి మీరు చెప్పిన మాటే కదా, మీ వైసీపీ నాయకులు ఎవ్వరికి ఏకగ్రీవమైనా టికెట్లు ఇవ్వనన్నారు. అయితే మీ పులివెందుల కూడా మీరు తప్పుకోవాలి.. డబుల్ ఇంజన్ సర్కార్ కేంద్రం, రాష్ట్రం. ఈనాడు రెండు ప్రభుత్వాలు ప్రజల కోసం, రాష్ట్రం కోసం కృషి చేస్తా ఉన్నాయి. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ వారితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహాయ సహకారాలతో మహానాయకులు అందరూ కూడా రాష్ట్ర అభివృద్ధికి ఈ రెండు సంవత్సరాల మూడు నాలుగు నెలల కాలంలోనే అనేక రకాలుగా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతా ఉంది. ప్రజలు పూర్తి సంతృప్తిలో ఉన్నారు. రేపు స్థానిక సంస్థల్లో కూడా జిల్లా పరిషత్ అయినా మండలం అయినా పంచాయతీ అయినా అందరూ కూడా కూటమి నుంచి ప్రజా ప్రతినిధులుగా రావాలి. ఈ డబుల్ ఇంజన్ సర్కార్, త్రిబుల్ ఇంజన్ సర్కార్ అవ్వాలి. అందరూ కూడా కలిసికట్టుగా ఢిల్లీ నుంచి గల్లీ వరకు పంచాయతీ వార్డు మెంబర్ నుంచి ప్రధానమంత్రి వరకు కూడా ఒకే దారిలో ప్రజాస్వామ్యయుతంగా ప్రజల కోసం, అభివృద్ధి కోసం ఈ రాష్ట్రాన్ని నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం ఈనాడు చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి బాసటగా, స్థానిక సంస్థల ప్రతినిధులను కూడా ప్రజలు గెలిపించడానికి వారిని ఎంపిక చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని ఈనాడు సగర్వంగా తెలియజేస్తున్నాని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.

సామాన్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కప్పల శ్రీధర్

రావులపాలెం , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): ఆత్రేయపురం మండల వైఎస్సార్సీపీ జడ్పీటీసీ అభ్యర్థి కప్పల శ్రీధర్ సోమవారం మండల పరిధిలోని కట్టుంగ , వసంతవాడ, నార్కెడ్ మిల్లి గ్రామాల్లో పాల నాగేశ్వరరావు తో కలిసివిస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలను, నాయకులను, కార్యకర్తలను కలుసుకుంటూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గం చూపేందుకు కృషి చేస్తానని శ్రీధర్ తెలిపారు. సామాన్య ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరల భారం పెరుగుతోందని, బియ్యం, పంచదార వంటి వస్తువుల ధరలు సామాన్య కుటుంబాల జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యావసర ధరల భారంపై ప్రజలు ఆలోచించాలని ఆయన అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమం, సామాన్యుల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా తాను పనిచేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కప్పల శ్రీధర్ ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు వైద్యశాల నూతన భవనానికి నివేదికలు సిద్ధం

అనపర్తి , అక్టోబర్ 27 (గ్లోబల్ వార్త): పసలపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని పశు వైద్యశాలను గ్రామానికి చివర ఉన్న ప్రదేశం నుండి రైతులందరికీ అందుబాటులో ఉండేలా గ్రామం మధ్యలోకి తరలించి,నూతన భవనం నిర్మించడానికి నిధులు విడుదల చేయాలని గత నెల 28వ తేదీన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చింతా తమ్మిరెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పశుసంవర్ధక శాఖ అధికారులు తక్షణమే స్పందించారు. స్థానిక కోరినాగయ్య వీధి సర్వే నెం.380/1 లో గల 4.8 సెంట్ల స్థలంలో గ్రామీణ పశు వైద్యశాల నూతన భవన నిర్మాణానికి రూ. 30 లక్షల అంచనా వ్యయంతో నివేదిక మరియు భవన నిర్మాణ ప్లాన్‌ను సిద్ధం చేశారు.ఈ ప్రతిపాదనలు మరియు నిర్మాణ ప్లాన్ లను అనుమతుల కోసం విజయవాడలోని 'డైరెక్టర్ ఆఫ్ యానిమల్ హస్బెండ్రీ' వారికి పంపించారు. దానికి సంబంధించిన పత్రాల ప్రతులను వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి. విజయ్ సోమవారం నాడు స్థానిక నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పసలపూడి గ్రామీణ పశు వైద్యశాల వైద్యులు డాక్టర్ సుధాకర్, జనసేన గ్రామ గౌరవ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి శివయ్య,బీజేపీ కిసాన్ మోర్చా గ్రామ అధ్యక్షుడు సత్తి శ్రీరామారెడ్డి (రమేష్) తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని రైతులకు అత్యంత సమీపంలో, అందుబాటులోకి పశు వైద్యశాలను తీసుకొస్తున్నందుకు ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు పశుసంవర్ధక శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మా రెండున్నరేళ్ల కష్టాన్ని గుర్తించండి : సీఎం

ఒకటి తరువాయి

అభివృద్ధి చెందడం ఆ పార్టీకి ఇష్టం లేదు. బెంగళూరు నుంచి వచ్చి హిట్ అండ్ రన్ తరహాలో దాడులు చేస్తున్నారు. తీవ్రవాదుల్లా వ్యవహరిస్తున్నారు. గొడ్డలి పార్టీ నేతలు ఈ హింసా విధానాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలి" అని చంద్రబాబు హితవు పలికారు. తమ ప్రభుత్వ సహనాన్ని, సంయమనాన్ని కూడా ఆ పార్టీ దుర్వినియోగం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఆస్తుల కోసం సొంత చెల్లెల్ని, తల్లిని మోసం చేస్తున్నారు. అతని ఆలోచన ప్యాలెస్ కోసం, మా తపన పేద ప్రజల కోసం. గొడ్డలి పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని సమర్థంగా దాటుకుని ముందుకెళతాం" అని వివరించారు.

ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి వేగం

గత ప్రభుత్వ పాలన విధ్వంసంతోనే సాగిందని, ప్రజాకంటక పాలనను అంతమొందించడానికే ప్రజలు కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు. "విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు మాకు అప్పగించారు. ఎల్ నినో కరవు పరిస్థితులు, అర్ణబ్ తుపాను వంటి ప్రకృతి విపత్తులు ఎదురైనా ఎక్కడా అభివృద్ధి ఆగకుండా చర్యలు తీసుకున్నాం. బటన్ నొక్కుతున్నాం కానీ గుంతలు పూడ్చలేమని గత పాలకులు చేతులెత్తేస్తే, మేం సంక్షేమం అందిస్తూనే అభివృద్ధి చేసి చూపిస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టుల నుంచి డేటా సెంటర్ల వరకు ప్రతిచోటా అభివృద్ధి కనిపిస్తోంది" అని అన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మూడు ఎకనామిక్ రీజియన్లను అభివృద్ధి చేస్తున్నామని, గ్రీన్ ఎనర్జీ కారిడార్ కింద రూ.27 వేల కోట్ల ప్రాజెక్టు రాష్ట్రానికి వచ్చిందని తెలిపారు. గత పాలకులు గోదావరిలో ముంచేసిన పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చారు. రెండున్నరేళ్లలో ప్రతి రంగంలో మార్పు తీసుకొచ్చి, ప్రతి కుటుంబానికీ న్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని కొనసాగించడానికి స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి 'ట్రిపుల్ ఇంజన్' ప్రభుత్వానికి శక్తినివ్వాలని ప్రజలను కోరారు.

సీట్ల సర్దుబాటుపై అపూర్వ కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కోసం తాను, పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ చేయనంత కసరత్తు చేశామని చంద్రబాబు తెలిపారు. "ఎంపీటీసీ స్థాయి వరకు సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాం. జనాభా దామాషా ప్రకారం సోషల్ ఇంజనీరింగ్ ఆధారంగానే సీట్లు కేటాయించాం. కూటమి ధర్మాన్ని పాటిస్తూ బీ–ఫాం ఇచ్చిన అభ్యర్థుల గెలుపునకే నేతలు, కార్యకర్తలు కృషి చేయాలి. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరూ వ్యవహరించవద్దు. ప్రస్తుతం సీట్లు ఇవ్వలేని వారికి భవిష్యత్తులో తప్పక న్యాయం చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.

అర్ణబ్ తుపాను ముప్పుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధత, ముందస్తు చర్యలపై అధికారులకు ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఈ తుపాను కాకినాడ సమీపంలోని యానాంకు 167 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని, గత ఆరు గంటలుగా గంటకు 23 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలపై తుపాను ప్రభావం, భారీ వర్షాల హెచ్చరికల గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఈదురు గాలులకు చెట్లు, హోర్డింగులు కూలిపోతే తక్షణమే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తక్షణమే స్పందించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఇక ట్రిపుల్ ఇంజన్ సర్కార్.. స్థానిక ఎన్నికలపై చాలా కసరత్తు చేశాం: సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పూర్తిస్థాయిలో కసరత్తు చేసిందని, ఈ ఎన్నికల్లో గెలిచి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేడు జరిగిన ఎన్డీఏ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటుపై తాను, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిసి ఎన్నడూ చేయనంత కసరత్తు చేశామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇంతగా శ్రమించలేదని, ఎంపీటీసీ స్థాయి వరకు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించామని వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యర్థి పార్టీపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "మా ప్రభుత్వ సహనాన్ని, సంయమనాన్ని గొడ్డలి పార్టీ దుర్వినియోగం చేస్తోంది. వాళ్లు సొంత కుటుంబంలోనే సంక్షోభాన్ని సృష్టించుకున్నారు. ఆస్తుల కోసం సొంత చెల్లెల్ని, తల్లిని మోసం చేస్తున్నారు. వారి ఆలోచన ప్యాలెస్ కోసం అయితే, మా ఆలోచన, తపన పేద ప్రజల కోసం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. నేరాలు, ఘోరాలు చేసే పార్టీ సృష్టించే అడ్డంకులను దాటుకుని ముందుకు వెళతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమిగా ముందుకెళుతున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంతో డబుల్ ఇంజన్ సర్కార్‌గా ఉన్నాం. ఇప్పుడు స్థానిక సంస్థల్లోనూ కూటమిని గెలిపిస్తే ట్రిపుల్ ఇంజన్ వేగంతో అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ ఎన్నికల్లో కూటమికి మద్దతు పలికి ఒక ట్రెండ్ సెట్ చేయాలని ప్రజలను కోరుతున్నాను" అని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి బీ–ఫాం పొందిన అభ్యర్థుల గెలుపుకోసమే అందరూ పనిచేయాలని ఆయన నేతలకు, కార్యకర్తలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరూ వ్యవహరించవద్దని సూచించారు. కొన్ని కారణాల వల్ల ఈ ఎన్నికల్లో సీట్లు పొందలేని నేతలకు భవిష్యత్తులో తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయాన్ని ఖాయం చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

మాది అభివృద్ధి, వారిది విధ్వంసం

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైసీపీపై 'గొడ్డలి పార్టీ' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ హింసాత్మక విధానాలను విడనాడి, జనజీవన స్రవంతిలో కలవాలని హితవు పలికారు. ఈరోజు ఎన్డీఏ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ తీరు రాజకీయ పార్టీలా లేదని, రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ నేతల వైఖరి తీవ్రవాదుల తరహాలో ఉందని చంద్రబాబు అభివర్ణించారు. "బెంగళూరు నుంచి వచ్చి రాష్ట్రంలో ఫేక్ ప్రచారం చేసి, మళ్లీ అక్కడికే వెళ్లిపోతున్నారు. ఇది 'హిట్ అండ్ రన్' తరహా వ్యవహారం. గతంలో నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చాను. ఆనాడు జనశక్తి నుంచి వచ్చిన సీతక్క ఇప్పుడు తెలంగాణలో మంత్రిగా ఉన్నారు. అదేవిధంగా, గొడ్డలి పార్టీ కూడా హింసను వీడి మెయిన్‌స్ట్రీమ్‌లో కలవాలి" అని చంద్రబాబు సూచించారు. క్రిమినలైజేషన్, లిటిగేషన్, ఫేక్ ప్రాపగండానే ఆ పార్టీ సిద్ధాంతమని, తమ కూటమి సిద్ధాంతం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం గొడ్డలి పార్టీకి ఏమాత్రం ఇష్టం లేదని చంద్రబాబు ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు ఏకంగా 62 పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. సర్వర్లు, డీలిమిటేషన్, బీసీ రిజర్వేషన్లపై కోర్టులకు వెళ్లి ప్రక్రియను అడ్డుకోవాలని చూశారని మండిపడ్డారు. "ఈ ఎన్నికలు జరగకపోతే 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోతాయి. స్థానిక సంస్థలు అభివృద్ధి చెందడం వారికి ఇష్టం లేదు. అందుకే నామినేషన్ల ప్రక్రియలో హింసాత్మక ఘటనలు సృష్టించారు" అని విమర్శించారు. సవాళ్లు, అడ్డంకులు ఎదురైనా కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం పటిష్ఠంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు అన్నారు. తాము పెత్తందార్లం కాదని, ప్రజలకు సేవకులమని, జవాబుదారీతనంతో పనిచేస్తున్నామని చెప్పారు. జనాభా దామాషా ప్రకారం సోషల్ రీ ఇంజనీరింగ్‌ను ఆధారంగా చేసుకుని మూడు పార్టీలు కలిసి సీట్ల కేటాయింపుపై సుదీర్ఘ కసరత్తు చేశాయని వివరించారు. ఎంపీటీసీలకు 46 వేలకు పైగా, జడ్పీటీసీలకు 4,700 పైగా నామినేషన్లు దాఖలు కావడమే ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. బీఫాం ఇచ్చిన కూటమి అధికారిక అభ్యర్థుల గెలుపు కోసమే నేతలు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2024లో చారిత్రాత్మక మద్దతు ఇచ్చిన ప్రజలు, తమ రెండున్నరేళ్ల కష్టాన్ని గుర్తించి స్థానిక ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. ప్రజలు ఇచ్చే ఓటు తమకు నూతన శక్తిని ఇస్తుందని, రాష్ట్రాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు.

కూటమిని గెలిపించండి: ఎన్డీఏ నేతల విజ్ఞప్తి

రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తిని ప్రదర్శించి, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు మీడియా సమావేశం నిర్వహించి, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు ప్రజల సంపూర్ణ మద్దతు అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉంటుందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు. రాష్ట్ర శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అన్ని పార్టీలు సర్దుకుపోయాయని, క్షేత్రస్థాయిలోనూ కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. సీట్లు దక్కని వారికి భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేసే బాధ్యతను కూటమి తీసుకుంటుందని పవన్ భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, పారిశ్రామికవేత్తల్లో ఉన్న నమ్మకం వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని పవన్ అన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం చంద్రబాబు సమర్థ నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. 'పల్లె పండుగ 1.0, 2.0', 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.30 వేల కోట్లతో 3.20 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేధింపులకు గురైన ఉద్యోగులకు రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లించామని, గంజాయిపై ఉక్కుపాదం మోపామని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో చూపిన ఆదరణనే స్థానిక ఎన్నికల్లోనూ చూపించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

తీరానికి దగ్గర్లో అర్ణబ్

ఒకటి తరువాయి

కేంద్రాలకు వెంటనే వెళ్లాలని సూచించారు. తమ ప్రాంతంలోని తుఫాను సమస్యలకు ప్రజలు మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా వేగవంతమైన పరిష్కారం పొందవచ్చని చెప్పారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 18004250101 లను సంప్రదించాలని సూచించారు. అర్ణబ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో నేడు ఆయన రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నేటి సాయంత్రంలోపు తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం తాగునీరు, వైద్యు సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మేం 10X చూపిస్తాం

ఒకటి తరువాయి

మాధవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఎన్డీఏ మీడియా సమావేశంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. జగన్ బెదిరింపులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరని పవన్ స్పష్టం చేశారు. బలహీనులు మాత్రమే బెదిరింపుల భాష మాట్లాడతారని, బలవంతులు ఎప్పుడూ అలా చేయరని అన్నారు. ఇలాంటి మాటల వల్లే గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన విషయాన్ని మరువరాదని అన్నారు. వైసీపీ 1.0 పాలనలో జరిగిన హింసను తాము ధైర్యంగా ఎదుర్కొన్నామని, ప్రజలకు అండగా ఎలా నిలవాలో తమకు బాగా తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లుగా, జగన్ ప్రజల్లోకి వస్తే వారి కష్టాలు, మనోభావాలు అర్థమవుతాయని పవన్ హితవు పలికారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ఐక్యంగానే ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు వంటి సంక్లిష్టతలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రగతి కోసం కలిసికట్టుగా ముందుకు సాగుతా మని తెలిపారు. రాజకీయ నాయకులు బాధ్యతా యుతంగా మాట్లాడాలి తప్ప హెచ్చరికలు జారీ చేయకూడదని సూచించారు. ఇదే సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, వైసీపీ నేతల ప్రవర్తన వల్ల సమాజం నష్టపోతోందని విమర్శించారు.

తుఫాన్ సహాయక చర్యల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలి: పవన్ కల్యాణ్

ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమ త్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. తుఫాన్ సన్నద్ధతపై కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారులతో ఈరోజు (మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ఆర్నబ్ విపత్తును సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రాణ నష్టం జరగ కుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. ఇవాళ సాయంత్రంలోపు తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని దిశానిర్దేశం చేశారు. 92 తుఫాన్ ప్రభావిత ఆవాసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలకు లోటు లేకుండా చూడాలని మార్గనిర్దేశం చేశారు. ఏలేరు వరద ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యుత్, రహదారులు, తాగునీటి సరఫరా పునరుద్ధరణకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. సహాయక చర్యల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధిస్తాం

ఒకటి తరువాయి

అంచనాలకు అవకాశం ఇవ్వలేదని మాధవ్ పేర్కొన్నారు. మూడు పార్టీల మధ్య సమన్వయం బాగుందని, అందరం కలిసి నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీట్ల సర్దుబాటు విషయంలో ప్రత్యేకంగా కృషి చేశారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని మాధవ్ చెప్పారు. కూటమి ఐక్యతతోనే ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ సుపరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలు ఎంతో కీలకమైనవని, ప్రజల ఆశీస్సులు తమకు కావాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో మాదిరిగానే స్థానిక ఎన్నికల్లోనూ మూడు పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతాయని మాధవ్ స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని కొనసాగిస్తూ ఎన్నికలను ఎదుర్కొంటామని తెలిపారు. 'చెప్పాం.. చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని పేర్కొన్నారు.

'ప్రాణనష్టం జరగకుండా చూడాలి' : మంత్రి అచ్చెన్నాయుడు

ఒకటి తరువాయి

తరలించి పశుగ్రాసం, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, అత్యవసర సహాయక పరికరాలను సిద్ధంగా ఉంచాలని.. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. తుఫాన్ తగ్గిన వెంటనే గ్రామాలవారీగా పంట, ఆస్తినష్టం అంచనాలు చేపట్టాలని.. రైతులకు అధికారులు, సిబ్బంది అండగా నిలవాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

జగన్ ఉడత బెదిరింపులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరు: మంత్రి అచ్చెన్నాయుడు

వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ ఉడత బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడేవారెవరూ ఇక్కడ లేరని, ఇది ప్రజాస్వామ్యం తప్ప జమీందారీ రాజ్యం కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు అచ్చెన్నాయుడు సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. "వడ్డీతో సహా చెల్లిస్తాం", "ఇప్పుడు మీ టైం.. తర్వాత మా టైం" వంటి హెచ్చరికలను మానుకోవాలని అచ్చెన్నాయుడు హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో తుది తీర్పు ఇచ్చేది ప్రజలేనని గుర్తుంచుకోవాలన్నారు. గత ఐదేళ్ల దారుణ పాలనపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక, అధికారులను, పోలీసులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి అభ్యర్థి పూర్తి స్వేచ్ఛతో నామినేషన్ వేస్తున్నారని, తమ పాలనకు, గత పాలనకు ఉన్న తేడా ఇదేనని పేర్కొన్నారు. గతంలో జరిగిన హింసాత్మక ఘటనలను ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. సొంత పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిపై వైసీపీ నేతలు దాడి చేసినా, పుంగనూరులో మిథున్‌రెడ్డి హింస సృష్టించినా జగన్‌కు కనపడలేదా అని ప్రశ్నించారు. మాచర్లలో బోండా ఉమ, బుద్దా వెంకన్నలపై జరిగిన దాడులను, ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌ను తొలగించేందుకు తెచ్చిన నల్ల ఆర్డినెన్స్‌ను ప్రజలు మర్చిపోలేదన్నారు. జగన్ తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని, ఎన్ని పాదయాత్రలు చేసినా, పొర్లుదండాలు పెట్టినా ప్రజలు ఇక నమ్మరని విమర్శించారు. "సొంత చెల్లి, మేనకోడలిపైనే కక్ష సాధించే సైకో, దుర్మార్గుడు రాష్ట్ర ప్రజలకు ఏం మేలు చేస్తాడు? తండ్రిలాంటి మేనమామ స్థానంలో ఉండి, సొంత మేనకోడలి వివాహానికే అడ్డంకులు సృష్టిస్తున్నావంటే నీ రాక్షసత్వం అర్థమవుతోంది" అంటూ అచ్చెన్నాయుడు తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.

సీఈసీ నిర్ణయాలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

ఒకటి తరువాయి

(సీఈసీ) జ్ఞానేష్ కుమార్ పనితీరును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలు ఏకగ్రీవంగా జరిగాయా? వాటి వెనుక ఉన్న సంప్రదింపులు, అభిప్రాయాలు ఏమిటి? అనే అంశాలపై పిటిషనర్లు ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై స్పందించిన సీజేఐ.. మాకు అన్నీ తెలుసని, అన్ని అంశాలను పరిశీలిస్తామని పేర్కొన్నట్లు లైవ్‌లా నివేదించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నాయకుల తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే సమయంలో ఎన్నికల కమిషనర్ల మధ్య జరిగిన చర్చలు, అంతర్గత సమాచార మార్పిడి, ఫైల్ నోటింగ్‌లను భద్రపరచాలని కోర్టును కోరారు. నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నారా? లేక కొందరు కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా జారీ చేశారా? అనేది తెలుసుకోవడానికి ఈ రికార్డులు అవసరమని ఆయన వాదించారు. నిర్ణయ ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు వాటిని భద్రపరచడం ముఖ్యమని పేర్కొన్నారు.

ఫారం–6లో మార్పులపై మరో పిటిషన్

రాజ్యసభ సభ్యురాలు డోలా సేన్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు స్పందించింది. బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం–6లో సుప్రీంకోర్టు అనుమతి లేకుండానే మార్పులు చేశారని ఆమె పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిటిషన్‌పై ఎన్నికల సంఘం, ఇతర ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. డోలా సేన్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది, ఎంపీ మేనకా గురుస్వామి.. ఫారం–6లో మార్పులకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం తప్పుగా పేర్కొన్నట్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ఆరోపణలను తోసిపుచ్చిన ఎన్నికల సంఘం

మరోవైపు, ఎన్నికల సంఘం తన నిర్ణయాలను సమర్థించుకుంది. సోమవారం సుప్రీంకోర్టుకు సమర్పించిన 248 పేజీల కౌంటర్ అఫిడవిట్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను గట్టిగా సమర్థించింది. ఓటరు నమోదుకు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారం–6లో ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘంపై నిందలు వేసే ప్రయత్నం దురదృష్టకరమని అఫిడవిట్‌లోనివేదించింది. ఈ అఫిడవిట్ దాఖలుకు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయంతోనే ఆమోదం లభించిందని కూడా ఈసీఐ తెలిపింది. దీంతో ఒకవైపు నిర్ణయాల ప్రక్రియపై పిటిషనర్లు ప్రశ్నలు లేవనెత్తుతుండగా, మరోవైపు తమ నిర్ణయాలు నిబంధనల ప్రకారమే తీసుకున్నామని ఎన్నికల సంఘం చెబుతోంది.

నవంబర్ 17న తదుపరి విచారణ

ఎన్నికల సంఘం సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌పై తమ స్పందనలు దాఖలు చేసేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు పది రోజుల గడువు ఇచ్చింది. రాకేష్ కుమార్ సింగ్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్‌ను కూడా ఈ గడువులోగా రిజాయిండర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది. అప్పటికి పిటిషనర్ల స్పందనలు అందిన తర్వాత ఎన్నికల సంఘం నిర్ణయాల ప్రక్రియ, ఎస్ఐఆర్ అమలు, ఫారం–6పై వచ్చిన ఆరోపణలను ధర్మాసనం పరిశీలించనుంది.

భయపడొద్దు : జగన్

ఒకటి తరువాయి

పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని... మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

అర్ణబ్ తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి : రామ్మోహన్ నాయుడు

ఒకటి తరువాయి

ప్రజలు నదులు, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయకూడదని, వరద నీటిలోకి వెళ్లకూడదని, అధికారుల హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు చేపల వేటకు దూరంగా ఉండాలని, ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారుల భద్రతకు అవసరమైన సూచనలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరి, మొక్కజొన్న, పత్తి, అపరాల పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. అరటి, బొప్పాయి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలకు నష్టం తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు పశుగ్రాసం, పశువైద్య సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే సమయంలో అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని మంత్రి సూచించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌ల సమీపంలో ఉండకూడదని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని, ప్రజలు కూడా అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ తుఫానును ఎదుర్కొనేందుకు సహకరించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విజ్ఞప్తి చేశారు.

పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలి

ఒకటి తరువాయి

సంప్రదించాలని ప్రజలకు సూచించారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆర్నబ్ తుపానుపై వివిధ శాఖల అధికారులతో మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అతి తీవ్ర తుపాను 'ఆర్నబ్'ను ఎదుర్కొనేందుకు రాష్ట్ర యంత్రాంగం పూర్తిగా సన్నద్ధంగా ఉందని అన్నారు. విపత్తు నిర్వహణ సంబంధిత శాఖల మంత్రులతో సమన్వయం చేసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం మీతో ఉందని ఎటువంటి ఆందోళన పడవద్దని ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, ప్రాణ నష్టం జరగకుండా చూడటమే ఈ ప్రభుత్వ ప్రాధాన్యత అని చెప్పారు. ప్రజలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖ తదితర బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని ప్రజలకు మంత్రి వంగలపూడి అనిత వివరించారు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA,
ARUNODAYA OFFSET PRINTERS"#33-5-9, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA"PH: 0866-2431422, 9346504777
"E-MAIL: ARUNODAYAVJW@GMAIL.COM . EDITOR DONDLAVAGU BHAVYA. 08562-461571 APTEL/2026/A2902